జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 1 సంచిక : 7

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శుభకృత్ ఫాల్గుణ మాసం - మార్చి 2023



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

# "కామకోటి"కి మార్గం కంచి పీఠం

### కంచి కామకోటి జగద్గురువులు శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారితో శ్రీ చాగంటి కోటేశ్వరరావుగారి ముఖాముఖి



**చాగంటివారు :** శ్రీ గురుభ్యోనమః స్వామీ మీలో మేము శంకర భగవత్పాదాచార్యుల వారి దర్శనం చేస్తున్నాము. మీరు కాకినాడ పట్టణానికి దూరంగా తిమ్మాపురంలోని గ్రామీణ ప్రాంతంలోకి వచ్చి ప్రేమతో ఈ పల్లెటూరి జనాల మధ్య చాతుర్మాస్యం చేయడం వల్ల వాళ్ళ జీవితంలో గొప్ప కల నెరవేరిందని ఎంతో ఆనందిస్తున్నారు. ఈ సందర్భగా సర్వ సాధారణంగా పీఠానికి సంబంధించిన వారు కామకోటి పీఠం మీద విశేషమైన భక్తి కలిగిన వాళ్ళకి సహజంగా వుండే ఆసక్తితో కొన్ని విషయాల గురించి మీ దగ్గర తెలుసుకోవాలని ప్రయత్నం స్వామీ. మనకి వచ్చేటటువంటి ఉత్తరాలు, మనం రాసే ఉత్తరాలలో శ్రీ శంకర భగవాత్పాదాచార్య పరంపరాగత మూలామ్నాయ అన్నమాట వాడతాంకదా స్వామీ. మూలామ్నాయ అన్న మాటకి అర్థం కొద్దిగా వివరణ చేస్తారా స్వామి?

**స్వామివారు :** మీరు చెప్పినట్టుగా ఇక్కడి ప్రజల జీవితంలో మార్పులే కాదు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారి జీవితంలో కూడా! ఈ చాతుర్మాస్య కోసం మూడు సంవత్సరాలుగా కృషి చేసి, పీఠాన్ని ఇక్కడికి తెప్పించి చాతుర్మాస్య వ్రతం చెయ్యాలన్న ప్రయత్నం సఫలత కూడా దీంట్లో వున్నది. ఈ ప్రాంతం అంటే గోదావరి ప్రాంతం ఒక సందర్భంలో సంస్కృతికి ఒక ఆధారంగా, ఒక నిధిగా వుండేది. ఇంత పురాతనమైన పవిత్రమైన సంస్కృతికి, ఈ తరం వాళ్ళు కొంచెం దూరమైపోతుంటే, ఈ ప్రదేశానికి చెందిన వారు దూరదేశాల్లో వుంటే వారినందరిని కూడా ధర్మ పరంగా మీరు దగ్గరికి తీసుకొస్తున్నారు. కనుక పంచారామక్షేత్ర ఇత్యాది ప్రసిద్ధమైన సప్తగోదావరి ప్రాంతంలో ఇలాంటి ధార్మిక సామజిక కార్యక్రమాలను ప్రోత్సహించడం కూడా మా రాక ఉద్దేశ్యం. ప్రజల్ని సంతోషింపచేయడం అనేది ఒకటి,

ప్రజల కోసం పనిచేస్తున్న వారిని ప్రోత్సహించడం అన్నది కూడా మా ప్రధాన ఉద్దేశ్యం. ఇక్కడ మీరు కంచి కామకోటి పీఠం మూలామ్నాయ సర్వజ్ఞ పీఠం ఎందుకంటారు అని అడిగారు. శంకర భగవత్పాదాచార్యులు దేశమంతా పర్యటన చేసి అనేక ప్రసిద్ధ క్షేత్రాలలో పీఠాలను స్థాపించి చిట్టచివరికి, శ్రీచక్రం స్వమాలికత్ అని చెప్పి కంచి కామాక్షి అమ్మవారి సన్నిధిలో స్వయంగా ఆయన శ్రీచక్రస్థాపితం చేసినారు. 'కాంచ్యామ్ శ్రీచక్రరాజాఖ్య యంత్ర స్థాపన దీక్షితాయ నమః' అని శంకరభగవత్పాదులని స్మరిస్తాము. కామకోటి అంటే లలితా త్రిశతి భాష్యంలో శంకరాచార్యులు చెప్పినట్టుగా కామకోటిం, శ్రీ చక్ర నిలయం యస్యాత్ కామకోటి ద్వయం... అంటే కామకోటి అనేది శ్రీచక్రానికి పర్యాయ పదం. (అక్కడ కంచిలో మీరు కంచి మహాత్యం గురించి చెప్పారు. ఇక్కడ ఆంధ్రదేశం నుంచి వచ్చినవారు చాగంటి వారు ఈ గుడి గురించి చెప్పారు. ఆ రాములవారి గుడి గురించి చెప్పారు అది ఎక్కడ వుందని లాంటివి అడుగుతారు.) ఆ శ్రీచక్రంలో అమ్మవారు నివాసం చేస్తున్నారు కనుక ఈ పీఠానికి కంచి పీఠం, కామకోటి పీఠం అని పేరు రావటం జరిగింది.

కోటి అంటే అనంతం. అక్కడ మూడు విమానాలు వున్నాయి. కంచి ఏకాంబరేశ్వరుడి గుడి విమానాన్ని రుద్రకోటి విమానం అంటారు. కంచి వరదరాజ స్వామి వారి విష్ణుకంచి విమానాన్ని పుణ్యకోటి అంటారు. కంచి కామాక్షి అమ్మవారి విమానం పేరు కామకోటి. రుద్రకోటి, పుణ్యకోటి, కామకోటి – అని మూడు విమానాలు కంచిలో వున్నాయి. మీకు తెలుసు శ్రీముఖంలో కూడా – త్రయస్త్రిమ్ శత్కోటి దేవతా సేవిత అని ప్రవచనంలో చెప్తారు. దీన్లో ఒక కోటి వుంది. దీని తర్వాత కోరికలు వుండేందుకు అవకాశమే లేదు. అంటే ఉత్కృష్టమైన కోరిక ఏమి ఉంటుంది. నహి జ్ఞానేంద్ర సదృశం పవిత్రమే విద్యతే – గొప్ప కోరిక, ఉత్తమమైన కోరిక, అలభ్యమైన, దుర్లభమైన కోరిక జ్ఞానము. ఈ జ్ఞానాన్ని అమ్మవారు ప్రసాదిస్తున్నారు. అందుకని ఈ కామకోటి కామనలకు, విజ్ఞప్తులకి, కోరికలకి అంతమైన అమ్మవారు ప్రసాదించే సీమమైన, నిస్సీమమైన జ్ఞానాన్ని ఈ పీఠం అందిస్తుంది కనుక ఇది కామకోటి పీఠం. మూలామ్నాయ అంటే దేశ వ్యాప్తంగా ప్రధానంగా వుండేది (నేషన్ వైడ్). సర్వజ్ఞ పీఠం అంటే శంకరభగత్పాదాచార్యులు – వారి కాంచి క్షేత్ర ఆగమన సమయంలో అక్కడ సర్వజ్ఞ పీఠ అధిరోహణ చేసినట్టుగా మనకు వారి చరిత్ర గ్రంథాలు కొన్ని తెలుపుతున్నాయి. అప్పుడు



తామ్రపర్ణి తీరం నుంచి ఒక చిన్న శిష్యుడు ఆయన శాస్త్రార్థం చేస్తున్నపుడు వచ్చారట. ఆతడికి శంకరులు సన్యాసాశ్రమం ఇచ్చి, ఆయనకే పీఠాధిపత్యం ఇచ్చి, సర్వజ్ఞాత్మేంద్ర సరస్వతి అని నామకరణం చేశారు. అలా చాలామంది వచ్చి ఆయనతో చర్చించారు. ఇంకా ఒకటి తమాషాగా చెప్తారు... ఎవరో పాదారక్షా పనిచేసేవాళ్ళు వచ్చారుట. ఈ విద్య నీకు తెలుసా అని అడిగారు శంకరాచార్యులని. అప్పుడు సూదితో ఆ ముక్కను ఈయన సరిచేశారుట... అంటే అన్ని కర్మ ధర్మ సూక్ష్మాల్ని వారు తెలుసుకున్నారు అని అంటారు. అలా సర్వజ్ఞ పీఠారోహణం చేశారు. అనేక శాస్త్రాలని, ప్రతిభని, జ్ఞానాన్ని అవసరమైనప్పుడు ప్రకటనం చేసిన చోటు అది. నేను జ్ఞానిని అని ఆయన చెప్పుకోరు కదా? ఇలా ఈ పీఠానికి కామకోటి అని పేరు వచ్చింది.

**చాగంటివారు : చాలా ఆనందంగా వుంది. ఎన్నో విషయాలు సూక్ష్మంగా వివరంగా తెలియ పరచారు. ఆ రుద్ర కోటి, పుణ్యకోటి, కామకోటి విమానాలు, జ్ఞానాన్ని ఇచ్చే పరదేవతగా కామాక్షి అమ్మవారు, ఆ తల్లిని కోటి దేవతలు సేవించడం – ఈ విషయాలన్నీ సామాన్యులకు సైతం అర్థమయ్యేలా చెప్పారు. సర్వ సాధారణంగా వేదం వ్యాప్తి చెందింది అంటే దానికి కామకోటి పీఠం ప్రధాన భూమికను పోషించిందని, ప్రత్యేకించి శ్రీ చంద్రశేఖరేంద్ర మహాస్వామివారి కాలంలో అంతరించి పోతున్న వేదశాఖలని ఎంతో పరిశ్రమ చేసి, కష్టపడి, దానికోసం కంకణబద్ధులై శ్రమించారని, కామకోటి పీఠం ఇంత పరిశ్రమ చేసి వుండకపోతే బహుశా వేదం ఇంత వ్యాప్తి చెందేది కాదని విద్వాంసులు అంటుంటారు. ఈ వేదపరిరక్షణలో కామకోటి చేసిన ఇంతటి గొప్ప సేవ గురించి మీ ద్వారా విని సంతోషించాలని వుంది.**

**స్వామివారు :** మీరు చెప్పిన విషయం నిస్సందేహంగా మన మహాస్వామి వారి ధృడతరమైన, అనుసూతమైన ప్రత్యేక శ్రద్ధ చూపించి చేసిన కృషి చేత ఇది సాధ్యమైంది. అంటే, ఇందుకు వారి తపస్సు ఒక కారణం. వారి సంకల్పం ఒక కారణం. వారి ప్రకల్పాలు, పథకాలు ఒక కారణం. అంటే లుప్తప్రాయంగా చెప్పేవాళ్ళు భావితరానికి లేరనే ఒక స్థితిలో వున్న అధర్వణ వేదాన్ని ఈ రోజు 200, 300మంది పఠిస్తున్నారంటే దానికి కారణం ఆ సమయంలో ఆ గుజరాత్‌కి ఇద్దరు



యజుర్వేద పండితులని మీరు నేర్చుకుని రండి అని పంపించి, వాళ్లకు అన్నీ ఏర్పాట్లు చేశారు. అంటే ప్రవర్తితో దీపైవ ప్రదీపాత్ అని కాళిదాసు చెప్పినట్టుగా ఆ స్వశాఖ అధ్యయనం చేసిన గుజరాత్‌లోని పంచోలి అన్నచోట వారు గురుముఖంగా వేదం నేర్చుకోవాలి. తరతరాలుగా వస్తున్న స్వచ్ఛమైన, పవిత్రమైన, పరంపరాగతమైన ఈ వేద ధర్మాన్ని కాపాడాలని, అధర్వ వేదాన్ని పునరుద్ధించినారని చెప్పవచ్చు. 'వేదానుద్ధరతే జగన్నివహతే' అని జయదేవ స్తుతిలో 'వేదాలుద్ధరతే' అని ఎలా చెప్పారో అలా మన కంచి పరమాచార్యులు వారు అధర్వ వేదాన్ని ఎక్కడో లుప్తప్రాయమైన దాన్ని చిన్న దీపంతో మహాదీపాన్ని వెలిగించినట్టు, కార్తీక దీపంలా మనకు అందించారు. అరుణాచలంలో గుళ్లో చిన్నదిగా ఉండి సాయంత్రం కొండమీద మహాదీపమైనట్టు. అలా స్వామివారు వారి తపస్సుతోనే ఈ దీపాన్ని వెలిగించారు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.

ఇక రెండో విషయం. వారు వారి జీవిత కాలంలో ఎన్నో సంఘటనలను చూశారు. దేశ వ్యాప్తంగా, విశ్వవ్యాప్తంగా అనేక మార్పులని చూసారు. 1907వ సంవత్సరంలో వారు పీఠానికి వచ్చిన సందర్భంలో వున్న పరిస్థితులు, మన దేశం, పొరుగు దేశాలు, అనేక సిద్ధాంతపరమైన మార్పులు, నిర్వహణపరమైన మార్పులు, ఇక్కడ అన్య దేశ నిర్వహణ – ఇలాంటి ప్రపంచ చరిత్రను ముందే అవగాహన చేసుకున్నవారు. వారి పూర్వాశ్రమంలో ఫ్రెంచ్ భాష కూడా మాట్లాడేవారు. అంటే పాండిచ్చేరి సమీపంలో జన్మించారు కనుక ఆ భాషలో కూడా వారికి పరిచయం వుండేది. వారిది సమదృష్టి, శాస్త్ర దృష్టి, దీర్ఘ దృష్టి. సమ దృష్టి అంటే అందర్నీ మంచిగా చూడాలి – ధనవంతులైన వాళ్ళు కాని, చదువుకున్న వాళ్ళు కాని, చదువుకోని వాళ్ళు కాని, పేదవాళ్ళు కానీ అందరిలో భగవంతుడిని చూడటం. కామాక్షి అమ్మ వారి దయ – దయార్ద్ర యా దృష్టిహి శిశిర ముపచారం రసేతి – అలా సమదృష్టి. ఇంకొకటి కృపా దృష్టి. శాస్త్ర దృష్టి అంటే ఏది చేసినా శాస్త్రం అనుమతిస్తుందా? శాస్త్రం ఒప్పుకోకుండా అంటే, పురాణంలో ధర్మరాజుకి చెప్తారు కదా అన్ని లోకాల్ని చూడమన్నారని. చూసినప్పుడు అన్నీ ఆయనికి మంచిగానే కనిపిస్తుందంటారు. అలా మన స్వామివారికి శాస్త్ర దృష్టి – ఏదైనా అంగీకరించాలన్నా, దేన్నైనా ఆమోదించాలన్నా, ప్రోత్సహించాలన్నా శాస్త్రం ఒప్పుకుంటుందా అని చూసేవారు. అందుకని 'తస్మాత్ శాస్త్రం ప్రమాణన్తే కార్యాకార వ్యవస్థితో' అనేది వారి దృష్టి. దీర్ఘదృష్టి అంటే సంపాతి ఇక్కడ కూర్చుని ఎక్కడో శ్రీలంక గురించి చెప్తుందని పురాణాల్లో చెప్తారు. అలా మన స్వామివారు ఇక్కడ మాత్రం చూడకుండా త్రికాలబద్ధంగా వుంటుందా, నిన్న ఏమి



జరిగింది, నేడు ఏమి జరుగుతూంది, రేపు ఏమి జరగాలి, ఏమి జరగవచ్చు అని కూడా వారు ఆలోచించి ఈ వేదశాస్త్ర సనాతన ధర్మం ప్రచారం కోసం అందరితో సౌమ్యంగా ఉంటూ బ్రిటిష్ ఇండియాలో కూడా వారు యాత్రలన్నీ చేశారు. ఈ భాగ్యనగరం వేరే నమ్మకం వున్నవారి పరిపాలనలో వున్నప్పుడు కూడా స్వామివారు వచ్చినప్పుడు అక్కడివారు సన్మానాలు చేసినారు. 1930 ప్రాంతంలో హైదరాబాద్‌లో 40 రోజులున్నారు. అనేక ప్రభుత్వాలు, సిద్ధాంతాలు, సమస్యలు ఉన్న నేపథ్యంలో పీఠ నిర్వహణ, సమాజ హితం కోసం ఏక కాలంలో ఎంతో సేవ చేస్తూ వుండడం అనేది అనితరసాధ్యం. అది స్వామివారు సాధించారు. ధర్మప్రచారానికి అనుకూలించనివారు పూనుకుంటే స్వామివారు ఇంగ్లీషులో కూడా మాట్లాడగలిగేవారు. ఇంగ్లీష్ పదాలు కూడా ఎక్కడ ఏ పదం వాడాలి అనే దాన్లో స్వామివారు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు. (అంటే అప్రాప్రియేట్) ఈ సందర్భానికి అనుగుణంగా వుంటుందా లేదా చూసి మాట్లాడేవారు. పెద్ద పండితులందరూ కూడా ఆశ్చర్యపడే విధంగా వారి భాష జ్ఞానం వుండేది.

ఆయన వాహనాన్ని వాడలేదు. ద్వేషం అని కాదు కానీ వారి

సంకల్పం, పట్టుదల, పద్ధతి పరంపరాగతమైన ధర్మం పట్ల వారికున్న ఆ విశ్వాసం అని చెప్పవచ్చు. ప్రిన్సిపుల్స్, సిద్ధాంతాలతో సహా వికాసాన్ని వారు సాధించి చూపించారు. దాని కోసం వారికి దొరికే సౌఖ్యాలన్నీ కూడా వదిలేశారు. పట్టువస్త్రం కూడా ఆయన చిన్న వయసులోనే వదిలేశారు. రామేశ్వరం వెళ్ళినపుడు స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో, ఆడంబర విదేశీ వస్త్రాలు పనికిరావు అనే ఒక సందర్భంలో, వారు ధనుష్కోటిలో ఆ పట్టు వస్త్రాన్ని (నిప్పుతో అంటించకుండా సన్యాసి కాబట్టి పరమహంస పరంపర కాబట్టి) సముద్రంలో విడిచి పెట్టారు. అప్పటినుండి వారు ఖాదీ బట్టలనే కట్టుకున్నారు చివరిదాకా. శిష్యులందరికీ 200 ఖాది బట్టలను తెప్పించి ఖాదీనే కట్టుకోమన్నారు.

నడిచే దేవుడు పుస్తకం రాసిన నీలంరాజు వెంకటశేషయ్య గారు స్వామివారి పుట్టినరోజుకి వచ్చేవారు. మేమే ఆయనను స్వామివారి వద్దకు తీసుకుని వెళ్ళే వాళ్ళం. ఆయన ఖాదీ కాషాయ వస్త్రం తెస్తే స్వామివారు కట్టుకునేవారు. అలా చిన్నవయస్సులోనే వారికీ సమాజం పట్ల ఒక శ్రద్ధ, ప్రేమ వుండేది. తన పదవి, అధికారం కన్నా శాస్త్రం, సమాజం, దేశం ముఖ్యం అనే విశాల దృక్పథం ఆయనది. తర్వాత 'ధర్మానికి ముఖ్యం వేదం' అని వారు నిశ్చయించుకుని, ఒక కుటుంబం వేదం చదివి, స్వధర్మానుష్ఠానం చేయవలసిన బాధ్యత గురించి అందరికీ చెప్పడం జరిగింది. మీరు అందరూ మీ కుటుంబాల నుంచి ఒకరినైనా వేదశాస్త్రం చదవడానికి పంపించండి అని. (మన జయేంద్ర సరస్వతి స్వామి వారి పూర్వాశ్రమ కుటుంబంలోని వారి తండ్రి గారు మా అబ్బాయిని పంపిస్తాం మీ ఆదేశాల ప్రకారం అన్నారు. ఆ తర్వాత స్వామివారు వారిని పీఠాధిపతిని చేశారు.) వేదశాస్త్రం ప్రకారంగా స్వశాఖను మనం పాటించాలి అని చెప్పేవారు. (ఈ వేదంలో విద్యార్థులు తక్కువమంది వున్నారు. ఆ వేదం నుండి కొంతమందిని ఇక్కడ పెట్టండి అనేది కాదు. ఈ క్లాస్ రూమ్ ఫిలప్ అయిపోతుందనే దృష్టి కాదు వారిది.) అంటే మీరు ఆశ్వలాయన సూత్రము ఋగ్వేదులంటే అది చదువుకోండి. మీది కాత్యాయన సూత్రం అంటే కణ్వశాఖ చదువుకోండి. మీరు కృష్ణ యజుర్వేదము బోధాయనము అంటే అది చదువుకోండి. సామవేదం అంటే సామవేదం చదువుకోండి. తరతరాలుగా దేశంలో (ఇక్కడకు వచ్చినవాళ్ళు చెపుతారే 'చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యః') అలా ఋషి పరంపరని పునః ప్రతిష్ఠ – అంటే ప్రశస్తితో గౌరవంతో పునః స్థాపించటం జరిగింది.

**చాగంటివారు : స్వామీ మన దేశంలో మహారాజులు,**



**చక్రవర్తులు, ధనవంతులు గొప్ప గొప్ప దేవాలయాలు కట్టారు. ఈ దేవాలయాలు అన్నీ గొప్పవే. కానీ కంచికామకోటి మఠం చొరవ తీసుకొని కట్టించిన సతారాలోని దేవాలయాన్ని 'ఉత్తర చిదంబరం' అని కీర్తిస్తారని ప్రశస్తి. ఎవరో ఒక ధనవంతుడు కట్టటం కాదు. కామకోటిపీఠం సంపాదించుకున్నటువంటి కీర్తి కిరీటం అది. ఒక్కసారి కామకోటి పీఠాధిపతులు సంకల్పం చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, ఏ రాష్ట్రంలో విలువైనవి ఏవి వున్నాయో వాటిని పంపించి ఆ దేవాలయ నిర్మాణం చేశాయి. అందుకనే దానికి ఉత్తర చిదంబరం అనే పేరు వచ్చింది. కామకోటిపీఠం సంపాదించుకున్న హద్దులు లేని కీర్తికి ఆ దేవాలయం ఒక నిదర్శనం అని చెపుతుంటారు. అసలు ఆ ఉత్తర చిదంబరం గురించి, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించడం గురించి ఆ వైనమేదో మీ నుండి తెలుసుకోవాలని వుంది స్వామి.**

**స్వామివారు :** మన స్వామివారు పూర్వాశ్రమంలో చిదంబరంలో కొంతకాలం వున్నారు. ఒక సామవేద పాఠశాల అక్కడ వుండేదట. దాని పక్కనే ఉన్న ఇంట్లో స్వామివారు ఉండేవారు. ఆ తర్వాత వారు పీఠభాధ్యతలను స్వీకరించిన పిదప యాత్ర చేస్తూ వుండగా ఓ సంఘటన జరిగింది. ఆ చిదంబరం క్షేత్రంలో స్వాగతం, పట్టణ ప్రవేశం చేశారు స్వామివారు. ఆ ముందురోజు రాత్రి ఆ గుడికి సంబందించిన దీక్షితార్, ఆ పుర ప్రముఖులు కొందరు వచ్చారు స్వామి వారికి స్వాగత సత్కారాలు ఎలా చేయాలో తెలుసుకోవడానికి. అంటే స్వామి వారికి పీఠ మర్యాదలు అవీ వుంటాయి. ఆ గుడికి కూడా వారి సాంప్రదాయాలు వుంటాయి. మరురోజు స్వాగత సత్కారాలు సక్రమంగా మంచిగా జరగాలని భక్తుల ఆకాంక్ష. స్వామివారు ఎన్నో క్షేత్రాలు దర్శించి వస్తున్నారు, ఉత్తర దేశం కూడా వెళ్ళి వచ్చారు కానీ ఎందుకో ఇక్కడకు ఇంతవరకు రాలేదు. మనం మంచిగా స్వామివారికి దర్శన ఏర్పాట్లు చూడాలని గుడి అధికారులు ఆలోచనల్లో వున్నారు. స్వామివారి పట్టణ ప్రవేశం అంతా బాగా జరిగింది. అందరూ విశ్రాంతికి వెళ్ళిపోయినారు. ఆ రాత్రి స్వామివారు తన సేవా కార్యక్రమంలో ఉన్న ఇద్దరికి మాత్రం 'రేపు ఉదయం మడి వస్త్రాలు తయారుగా పెట్టుకోండి, కాషాయ వస్త్రాలు కూడా సిద్ధంగా పెట్టుకోండి' అని చెప్పారు. ఎందుకో తెలియదు. ఆ రోజు స్వామివారు ఉదయమే లేచి ఆ ఇద్దరికీ తప్ప ఎవ్వరికీ చెప్పకుండా బయల్దేరారు. వస్త్రాలకి ఒకరు, విభూతి రుద్రాక్షలు వెంట తీసుకరావడానికి, ఆసనం వెయ్యడానికి ఒకరు – వేరే ఎవ్వరికీ తెలీదు. అంత పెద్ద పరివారం కూడా ఉన్నప్పటికీ, ఎవ్వరికీ చెప్పలేదు. ఆయన సన్యాసిగా అలా వెళ్ళిపోయారు. పీఠాధిపతిలా కాకుండా ఒక సన్యాసిలాగా వెళ్ళి శివగంగ తీర్థంలో స్వామివారు స్నానం చేసి, అనుష్ఠానం అన్నీ చేసుకుని, ఉదయం ఉషః కాలం హారతి సమయానికి వెళ్ళి నటరాజస్వామి వారి ముందు నిలుచున్నారు. ఉదయాన్నే రోజూ వచ్చి పూజ చేసే దీక్షితార్ వచ్చారు. హారతి ఇచ్చారు, పాలు నైవేద్యం పెట్టారు. ఇలా వచ్చి చూస్తే స్వామివారు అక్కడ నిలుచొని వున్నారు. ఏం చెయ్యాలో ఆయనకు అర్థం కాలేదు. ఇక్కడ పీఠం పరివారానికి కూడా తెలీదు ఎక్కడ వున్నారో అని. అలా స్వామివారు కొన్ని సందర్భాలలో తీసుకునే కొన్ని నిర్ణయాలు లోకంలో అందరికి ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా వుంటాయి. 'అదేంటి స్వామీ, మేం మిమ్మల్ని బ్రహ్మాండంగా ఆహ్వానం చేయాలనుకున్నాం అన్నారు. ఏమీ చెప్పకుండా స్వామివారు వచ్చారని తరువాత తెలుసుకున్న ప్రజలకు కూడా ఆశ్చర్యవే'. ముందురోజు రాత్రి చాలా సమయం అయిపోయింది స్వామివారు వచ్చేటప్పటికి. పల్లకిని వీధి ప్రదక్షిణంతో ఇక్కడికి తీసుకరావడం జరిగింది. అందరికీ ఆశ్చర్యం. తరువాత అనేక పర్యాయాలు స్వామివారు నటరాజస్వామివారి దర్శనం చేసుకున్నారు. అప్పుడు అందరూ ఆహ్వానించారు. స్వాగతసత్కారాలు అన్నీ చేసారు. ఆరుద్ర నక్షత్రం రోజు నటరాజస్వామికి మూడు, నాలుగు గంటల సేపు అభిషేకం జరుగుతుంది. స్వామివారు అభిషేకం చూస్తూ అక్కడే కూర్చుని ధ్యానం చేస్తూ చిదంబర స్వామి దర్శనం చేసుకున్నారు.

తరువాత షాన్బాగ్ అనే ఒక ధనికుడు సతారాలో కొంత ధనంతో పాటు భూమిని ఇస్తాను అని ముందుకు వచ్చారు. అప్పుడు స్వామివారు నాకు ఇచ్చేది కాదు కదా. భూమిని ఏర్పాటు చేసి ఒకసారి చిదంబరం వెళ్ళి నటరాజస్వామిని దర్శించుకొని గుడిని చూసి రండి అని ఆయనకు చెప్పారు. అప్పుడాయన 'ఇంత పెద్ద కార్యాన్ని నేను ఎలా చేయగలను' అంటే స్వామివారు, ముందు మీరు సంకల్పం చేసుకోండి. అలాంటి గుడిని మీరు ఈ ఊరిలో కడతారు. ఈ గుడిని అంతా కట్టించింది స్వామివారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు గారికి, కర్ణాటకలోని రామకృష్ణ హెగ్డే గారికి, తమిళనాడు లోని రామచంద్రన్ గారికి మహారాష్ట్రలోని వసంతదా పాటిల్ అనే ఆయనకు, కేరళలో కరుణాకరన్ అనే ఆయనకు, కేంద్ర ప్రభుత్వంలోని ఇందిరా గాంధీ గారికి ఇలా అందరికీ స్వామివారే స్వయంగా చెప్పారు. గోపురం ఒక రాజ్యానికి చొప్పున బాధ్యతలనిచ్చారు అంటే తమిళనాడుకు ఆంధ్రప్రదేశ్‌కు, మహారాష్ట్రకు, కర్ణాటకలకు. చందన తలుపులు చెక్కతో చేసే పనులకి కేరళది బాధ్యత. మీరే చెప్పారు కదా ఎవరికి ఏ బాధ్యత ఇస్తే ఎవరి చేత ఏ సేవ చేయిస్తే వాళ్ళు



సంతోషిస్తారు అని, అలాగే, మందిర నిర్మాణం కూడా సమగ్రంగా జరుగుతుందన్న ఆలోచనతో ఇలా విభజన చేశారు.

భరత నాట్యం అంటే భారత నాట్యం. ఆ నాట్య శాస్త్రంలో భరత ముని చెప్పిన కరణాలు ఆ నాట్య విశేషాలు, (స్వామివారు కేవలం నటరాజ స్వామి వారి ప్రతిష్ఠ చేయలేదు), దానితో పాటుగా నాట్య శాస్త్రానికి కూడా అక్కడ ప్రఖ్యాతి వచ్చేటట్టుగా ఈ కరణాలన్నీ కూడా శిల్పిద్వారా ధ్యానశ్లోకంతో సహా కొన్ని దేవస్థానంలో చెక్కించారు. అవి అన్ని 108 కరణాలు అంటారు. ఇవన్నీ కూడా పార్వతీ పరమేశ్వరులు తాండవం చేస్తున్నట్టుగా తయారు చేయించి అక్కడ పెట్టించారు. ఆ గుడి కేవలం భక్తికి మాత్రమే కాదు, కళా కేంద్రం కూడా. అందుకే ఉత్తర చిదంబరం అని పేరు. అక్కడ చిదంబరంలో వుండే విశేషాలకు ఏ మాత్రం తక్కువ లేకుండా గొప్పగా స్వామివారు తమ మనః సంకల్పంతో తయారు చేయించిన దివ్య ఆలయం. 'సతారా' అనేది సమర్థ రామదాసు గారు, ఛత్రపతి శివాజీ గారు - వారికి సంబందించిన ఊరు. 'ధర్మస్య ప్రభురచ్యుతః' అంటారు కదా, అలా ధర్మానికి ప్రభువు భగవంతుడు. "ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమ బంధుః పశుపతే" అన్నట్టుగా ఈ ప్రభువు... నటరాజస్వామి వారికి ప్రభుత్వాల చేత గుడి నిర్మాణం చేయించింది మన స్వామివారు. వారు తలుచుకొంటే ఎవరైనా దాతలకు చెపుతారు, వారు నిర్మాణం చేస్తారు. అంటే వారి ఏ క్రియలో ప్రతిక్రియ ఉండదు. ఒక ధర్మ సందేశం వుంటుంది. మన దేశంలో ప్రభుత్వాలు, రాజులూ, అందరూ కూడా సంస్కృతిని పోషించారు. ఈ రోజు ప్రభుత్వంలో వుండే మీరందరూ కూడా మన ధర్మం, కళలు, సంగీతం, నాట్యం, భక్తి, సదాచారం, సభ్యత వీటిని పోషించాలి అని చెప్పకుండా ఒక మౌన సందేశం. వారి సందేశంలో మౌనాన్ని గురించి చెప్పారు. మౌనం ద్వారా స్వామివారు మనకు అందించిన అనేక సందేశాల్లో చిదంబరం అనేది ఒకటి. సతారాలో నక్షత్రంలాగా ఈ ఉత్తర చిదంబరం అనేది వున్నది. అనేక ప్రశ్నలకి ఒక సమాధానంగా ఆ నటరాజ మందిరం వుంది. ఆరుద్ర నక్షత్ర ఉత్సవం ఈ రోజు కూడ మంచిగా జరుగుతోంది.

**చాగంటివారు : మీరు సతారాలోని ఉత్తర చిదంబరం గురించి చెబుతుంటే ఎప్పుడెప్పుడు సతారా వెళ్ళి ఆ ఉత్తర చిదంబరంలోని దేవస్థానం దర్శనం చేస్తామా అని వుంది. నిజంగా దక్షిణ దేశంలో ఉన్నటువంటి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలని ఎవరెవరి దగ్గర ఏ గొప్ప కళ వుందో అన్నింటినీ కలిపి, అందరూ ఇలా కలిసికట్టుగా బ్రతకండి అనే సందేశాన్ని మౌనంగా ఇవ్వడం కూడా ఆ దేవాలయం ప్రత్యేకత ఏమో. నిజంగా చాలా అద్భుతమైన విషయం చెప్పారు స్వామీ! సాధ్యమైనంత తొందరగా సతారా వెళ్తాం. మేమందరము కూడా ఆ దేవాలయాన్ని దర్శనం చేసుకుంటాం.**

**స్వామివారు :** అక్కడి ప్రతిష్ఠిత యంత్రం కూడా పంచలోహ మూర్తి. ప్రతిష్ఠకు వెళ్ళకముందు కంచిలో స్వామివారు వుండగా అది

తీసుకువచ్చారు. స్వామివారు ఆ మూర్తిని చూసి, ఆ చేతి నుంచి ఆ నీరు, ఆ తీర్థం పాదానికి చేరుతుందా లేదా అని గమనించారు. ఆ ముద్ర ఎలా వుండాలి అంటే చిదంబరంలో దర్శనం చేసుకున్నారు కనుక తత్ రూపంగా వుండాలని నిర్ధారించుకున్నారు. యాగశాల నిర్మించినప్పుడు కూడా పంచాక్షర సంబంధంగా గొప్ప యంత్రం స్థాపించారు. చిదంబరంలో ఎలా ఆ యంత్ర పూజ చేస్తారో అలా చేయించి, దాన్ని స్వామివారు స్వయంగా చూసి, అంగీకరించి, యాగశాలలో పూజలను ఏర్పాటు చేయించి, మన జయేంద్ర స్వామి వారిని సతారాకు పంపించి, కుంభాభిషేకం చేయించి, ఆ ఛాయాచిత్రాలన్నీ చూసి స్వామివారు ఆనందించారు. అలా వారి కటాక్ష వీక్షణం వలన గుడికి కావాల్సిన భూమి నుండి పూర్ణకలశం వరకు వారి మనఃసంకల్పం కార్యరూపం దాల్చి ఆనందించిన దేవాలయం అది.

**చాగంటివారు : స్వామి సర్వసాధారణంగా నా వంటి వారు నోటితో ఎన్ని మాటలైనా చెప్తారు కానీ ఆచరణ దగ్గరకు వచ్చేటప్పటికి తేలిపోతారు. కానీ ఒక గోశాల అంటే ఎంత గొప్పదో, ఒక గోవు అంటే ఎంతగొప్ప ప్రాణో, ఆశ్రమంతో సంబంధం లేకుండా బ్రహ్మచారీ, గ్రహస్తు, వానప్రస్థంలోని వారు, సన్యాసులు అందరుకూడా సేవించడానికి, ముట్టుకోవడానికి, గ్రాసం పెట్టడానికి, యోగ్యమైన పరదేవతా స్వరూపమని శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామివారు చెప్పగా చదివాం. సర్వసాధారణంగా బోలెడన్ని గదులు, అన్ని సదుపాయాలు కల్పించే మహానగరాలకు వెళ్ళడం జరుగుతుంది. కానీ మీరు మహా స్వామివారు ఏమి చెప్పారో ఆ కలలని నిజం చేస్తూ ఇంత పల్లెటూరు ప్రాంతానికి వచ్చి, గోశాలకు ప్రతి రోజూ వచ్చి వాటిని చూస్తూ మురిసి పోయి ఇంత ఆనందపడుతున్నారు. ఇక్కడ వున్నవాళ్ళందరూ అంత మరీ పెద్ద చదువుకున్న వాళ్ళు కాదు. పల్లెపట్టున వుండి వ్యవసాయంలో వున్నవాళ్ళే ఎక్కువ. కొన్ని వేలమంది ప్రతిరోజు మీ దర్శనానికై వస్తున్నారు. ఈ ప్రాంతానికి ఇన్ని వాహనాలు వచ్చిందే లేదు. ఇదే గోశాలనుంచి ఈ చాతుర్మాస్యం సందర్భంగా, మేమందరం ప్రతిరోజు అనుష్ఠించడానికి యోగ్యమైన రెండు విషయాలు ఒక ఆదేశంగా మాకు చెప్తే, స్వామీ, ఆ రెండింటిని జ్ఞాపకం పెట్టుకుని జీవితపర్యంతంగా మేము ఆచరిస్తాం. మీరు ఇంత సామాన్యుల దగ్గరకు ఇంత ప్రేమగా వచ్చారు. మాకు రెండు ఆదేశాలు ఇవ్వండి, అవి మేం పాటిస్తాం.**

**స్వామివారు :** మీరు గోశాల గురించి చెప్పారు. ఆవు ప్రసూతి సమయంలో శిష్యులు వచ్చి 'ఆవు దూడను కనే సమయం' అని చెప్పగానే స్వామివారు 90 ఏళ్ళ వయస్సులో కూడా వెంటనే గోశాలకు వచ్చేవారు. ఆవులకి ఇబ్బంది కలుగకుండా దూరంగా కూర్చొని నిశ్శబ్దంగా ఆ తల్లి, దూడ ముఖాలతో ఆవు ద్విముఖంగా కనిపిస్తున్నపుడు దానికి ప్రదక్షిణ చేసేవారు. ఆవుకి ఇబ్బందిగా వుండకూడదని, ప్రదక్షిణ చేయడానికి పెద్దగా చోటు లేకపోయినా అంత లాఘవంగా, జాగ్రత్తగా వారు ప్రదక్షిణ చేసేవారు. అంత పెద్ద చోటు ఉండేది కాదు అప్పట్లో. ఆ తరువాత స్వామివారు మఠం చేత కొంత స్థలం కొనిపించారు. ఇప్పుడు కొంచెం పెద్దదిగా వుంది.

ఒకసారి, కర్నూలు చాతుర్మాస్యం నుండి కంచికి ఇంకా రాలేదు, రాబోతున్నాము. వెంట వున్న అధికారిని స్వామి వారు అడిగారు. ముగ్గురు స్వాములవార్లు పీఠంలో వుండాలి. రెండు నెలల తరువాత కంచికి రాబోతున్నారు. ఇప్పుడున్న చోటు సరిపోతుందా అని. సౌరమాన ఉగాదికి, మాఘమాసంలో స్వామివారి గురువుగారి, పరమగురువు గారి ఆరాధనకు కలవై వచ్చారు. కంచికి వెళ్తున్నాం అని ఏయే ఏర్పాట్లు చెయ్యాలో రెండు నెలల ముందే వారు సూచనలిచ్చారు. ఇప్పుడు మనం చూస్తున్న పీఠం వారి సంకల్పంతో పెద్దది అయింది. అది విస్తృతమైంది. అంతకు ముందు చిన్నగా వుండే గోశాలలోనే ప్రదక్షిణ చేశారు. గోపూజలు కూడా ఎన్నో చేసారు. 1937 ఆ ప్రాంతంలో, నెల్లూరులో స్వామివారు కూర్చొని వుండగా ఒక వైపు ఆవు, ఒక వైపు ఏనుగు వున్న ఫోటో వుంది. గోసంరక్షణలో వారికి ఒక ప్రత్యేకమైన అభిమానం వుంటుంది. పీఠ పూజలో ఇప్పటికీ ఋగ్వేదంలోని గోసూక్తం పఠిస్తారు. అలా గోసంరక్షణ పట్ల ప్రత్యేక ఆదరణ చూపించడం గొప్ప విషయం. అందుకే మీతో ఒక సందర్భంలో మాట్లాడితే మహాస్వామి మందిరం మీరు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ మీరు, భక్తులు అంత బాగానే చేస్తున్నారు. డిసైపుల్ అంటే డిసిప్లిన్ ముఖ్యం. ఇక్కడ భక్తులందరూ కూడా మంచి భక్తిశ్రద్ధలతో వినమ్రతతో ఈ గోశాలను బాగా చూసుకుంటున్నారు. వారు చేస్తున్న సేవా కార్యక్రమాలన్నీ చూస్తున్నాం. ఇప్పుడు కొత్తగా మొదలు పెట్టారే మౌనం పాటించడం, ఇది ఒక మంచి తపస్సు. మూలా నక్షత్రం రోజు స్వామివారు మౌనాన్ని ఆచరిస్తారు అని అందరికీ తెలుసు. మూలా నక్షత్రం వస్తే ఎవరొచ్చినా మౌనమే. మూలా నక్షత్రం ముందు రోజు ఒకసారి హోమ్ మినిస్టర్ వచ్చారు. ఆయనతో మాట్లాడారు. మరుసటి రోజు మూలా నక్షత్రం నాడు ప్రైమ్ మినిస్టర్ వచ్చారు. అయినా మౌనమే అదే నిబద్ధత. ఇది జరిగిన విషయం, చూసిన విషయం.

**చాగంటివారు : హోమ్ మినిస్టర్‌తో ముందు రోజు మాట్లాడిన స్వామివారు మరుసటి రోజు ప్రైమ్ మినిస్టర్ వచ్చినా మాట్లాడలేదుట.**



**ఎంత నిబద్ధత!**

**స్వామివారు :** నిజమే! సమయం దాటి పోయింది అంటే మౌనమే. వారనుకున్న సత్సంకల్పాన్ని వారు అలా చేస్తూనే వుంటారు. మేము చూశాం కూడా. వ్యాసపూజ ఒకోసారి మూలా నక్షత్రంలో వస్తుంది. దానికి ఏర్పాట్లన్నీ జరుగుతూ వుంటాయి. అయినా మౌనంగా వుంటారు. ఏమేమి అందించాలో పూలు, చందనం అవన్నీ శిష్యులు తెలుసుకుని అందిస్తుంటారు. ఇదంతా చాలా సంవత్సరాలు వారు చేశారు. వారి అనుగ్రహం పొందటానికి మీరు ఇప్పుడు తీసుకున్న నిర్ణయం ఎంతో సహకరిస్తుంది. మౌనం పాటించడం అనేది, అదీ మూలా నక్షత్రం రోజు పాటించడం అనేది వారి అనుగ్రహ ఆశీస్సులు పొందేటందుకు ఒక మంచి సాధనం.

రెండవది ఇక్కడ గోసంరక్షణం చేస్తున్నారు. గోసంపదను పోషిస్తున్నారు. మనకు వేద సంరక్షణం, గో సంరక్షణం రెండూ ముఖ్యం. వేదం సంరక్షణ కొంత జరుగుతున్నది కానీ ఈ మధ్య కాలంలో గోసంరక్షణం తీవ్రత అనేది కొంత తగ్గింది. ఉత్తర దేశంలో బాగా పెద్ద ఎత్తున చేస్తున్నారు. దక్షిణ దేశంలో కూడా చేయడమనేది మహాస్వామి వారికి మంచి సంతోషం కలిగించే విషయం. ఒక విదేశీ భక్తురాలు మన భాగ్యనగరానికి కూడా వచ్చింది. 'ప్రిన్సెస్ ఐరీన్' అని పేరు. మహాదేవన్ గారు అని ఒక ప్రొఫెసర్ దగ్గర ఆవిడ ఫిలాసఫీ నేర్చుకుంది. టీఎంపీ మహాదేవన్ అనే ఆయన స్వామివారి దర్శనానికి వస్తే ఆయన పేరులోని లెటర్స్‌ను ఇంగ్లీషులో కింద నుంచీ చదవమన్నారట స్వామి వారు. 'న వేదాహం' అని వచ్చిందట. ఆయనను స్వామివారి ఆశీర్వదించారు. ఒకసారి ఆయన గ్రీస్ దేశంలోని ఏథెన్స్ నగరానికి ఫిలాసఫీ కాన్ఫరెన్స్ కోసం వెళ్ళారు. రాజుగారు, రాణిగారు ఇద్దరూ అక్కడకు వచ్చారు. వారు టీఎంపీ మహదేవన్ గారిని ఇలా అడిగారు. 'మీరు తత్వశాస్త్రం, అద్వైతానుభూతి, సర్వాత్మ దర్శనం గురించి చెప్తున్నారు. బాగానే వుంది. మాకు ఆశ్చర్యంగా వుంది. ఆవేదనగా కూడా వుంది. ఈ గొప్పతనాన్ని తపస్సుని మనం ఒక వ్యక్తిలో చూడగలుగుతామా అని. మీరు చెప్పే ఉపన్యాసాలు బాగున్నాయి. ఇవి పుస్తకం వరకే పరిమితమా లేదా ఎవరైనా తమ జీవన విధానంలో ఆచరిస్తున్నారా. ఇలాంటి మహత్వపూర్ణమైన జీవిత లక్ష్యాన్ని పాటిస్తున్నారా?" అని అడిగితే ఆయన చెప్పారట కంచి మహాస్వామివారున్నారు అని. వెంటనే మేము వారిని సందర్శించే అవకాశం వుంటుందా అని వాళ్ళు ప్రశ్నించారు. అప్పుడు మహదేవన్ గారు నేను వెళ్ళి అనుమతి తీసుకొని మళ్ళీ చెపుతాను అని అన్నారట. ఆ పిదప స్వామివారి అనుమతితో ఆ రాజపరివారాన్ని ఇక్కడికి తీసుకొచ్చారు. వారు అప్పటినుండీ భారత దేశానికి వస్తున్నారు. నెహ్రూగారి ప్రభుత్వం నుంచీ వస్తున్నారు. విదేశంలో ఆవుల సంఖ్య పెరిగిపోయింది. వ్యాపార రీత్యా ఆవులకు ఏదో ఇబ్బంది కలిగిస్తున్నారు అనే వార్త వార్తాపత్రికల ద్వారా పెద్దస్వామి వారి దృష్టికి వచ్చింది. స్వామివారు ఈ ప్రిన్సెస్ ఐరీన్ గారిని పిలిచి మీవల్ల ఏమి అవుతుందో యథాశక్తి గోసేవ చేయండి అన్నారు. స్వామివారు చెపుతున్నారంటే వారూ అర్థం చేసుకుంటారు కదా మరి. ఆమె ఇఇసి (యూరోప్ ఏకనామిక్ కౌన్సిల్)తో మాట్లాడి వంద ఆవులని విమానంలో తెప్పించింది. ఆ ఆవులని ఊటీ, అస్సాంలాంటి చలి ప్రదేశాలు ఎక్కడైతే వున్నాయో అక్కడికి పంపించారు స్వామివారు. అంటే విదేశీ ఆవులకి ఎండ పడదు కనుక అలా ఏర్పాటు చేశారు. స్వామివారికి గో సంరక్షణ విషయంలో ఎంత ఆసకి ఉందో చెప్తున్నాం. ఇప్పుడు మీరు దేశీ ఆవులకి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సేవ చేస్తున్నారే అది మంచి విషయం.

**"సంచార పూతాని దిగంతరాని కృత్వా దినాంతే నిలయాయ గంతుమ్**
**ప్రచక్రమే పల్లవ రాగ తామ్రా ప్రభా పతంగస్య మునేశ్చ ధేనుః"**

అని చెప్పారే అలా దేశాన్ని తమ సంచారం చేత పునీతం చేస్తున్న ఆవుల్ని, గోధూళి లగ్నం అని మనం గొప్పగా భావిస్తున్న

ముహుర్తాన్ని, ఆవు వంశ పరంపరని కాపాడుటమనేది స్వామివారికి చాలా ఇష్టమైన విషయం. ఇక్కడ మీరు వాలంటీర్లను ఏర్పరిచి, అందరినీ క్రమశిక్షణతో తయారు చేశారు. అందరూ కూడా ఉదయమే తమ బాధ్యతలను పాటిస్తున్నారు. కొందరు పచ్చిక ఇస్తున్నారు, కొందరు శుభ్రం చేస్తున్నారు అన్ని విధాలా సేవాభాగ్యం కలిగించటమనేది స్వామివారి కృపాకటాక్షం.

వీళ్ళందరికీ గోశాల ద్వారా అవకాశం కల్పించటమనేది మంచి విశేషం. ఒకటి మౌన ప్రకటితమైతే, రెండవది భక్తి ప్రచారాలు బాగా చేస్తున్నారు. మంచి విషయాలు దేశ విదేశాలలో యువతను ప్రభావితం చేసి మన భాష, మన సంస్కృతిని, కాపాడగలిగేటట్లుగా తయారు చేయడమే "ధార్మిక నర్సరీ". కడియం పూల నర్సరీ అయితే ఇక్కడ జరిగే సత్సంగాలు "ధార్మిక నర్సరీ" లాగా జనంలో చైతన్యం, జాగృతి, స్ఫూర్తి, ప్రేరణదాయకంగా ఉంటున్నాయి. గో సేవను స్ఫూర్తిదాయకంగా చేయాలి. గోసేవ ఎలా చెయ్యాలి, అందరూ చేయగలరా, అనేది సత్సంగంలో వృద్ధి చెంది తద్వారా అందరికీ మంచి జరగాలి.

**చాగంటివారు : మీరు మాకు ఇచ్చిన ఈ రెండు ఆదేశాలని త్రికరణశుద్ధిగా మేమందరం కూడా శిరసావహిస్తున్నాం స్వామి. ఇంకా రెట్టించిన ఉత్సాహంతో గో సేవ చేస్తాం. గో సంరక్షణం చేస్తాం. మీరు ఆదేశించిన మీదట గత మూలా నక్షత్రంలో ఒక అరగంట మౌనం పాటించడం ప్రారంభించాం. క్రమక్రమంగా దానిని పెంచి మూలా నక్షత్రం రోజున పూర్తిగా మౌనం పాటించే విధంగా మీరు మమ్మల్ని ఆశీర్వదించండి స్వామీ.**

**స్వామివారు :** పూర్తి మౌనం పాటించడం అవకాశాన్ని బట్టి, సాధ్యాసాధ్యాలను బట్టి ఎవరికి వారు జాగ్రత్తగా ప్రయత్నించాలి. ఇప్పుడు మీరు అందించారు కదా సందేశాన్ని.

**చాగంటివారు : అయితే ఒక గంటో రెండు గంటలతోనో మొదలు పెడతాం.**

**స్వామివారు :** అది సరే, దాని గురించి కాదు. మొత్తానికి ఆ రోజు మనకి స్వామివారు గుర్తుకు వస్తారు. స్వామివారి ఆశీర్వాదం వస్తుంది. సరస్వతి కటాక్షం వస్తుంది. మూలా నక్షత్రం రోజు మౌనంగా వుంటే చాలా మంచి జరుగుతుంది.

**చాగంటివారు : స్వామీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామివారు అనగానే ఒక గంభీరమూర్తి మనస్సులో సాక్షాత్కరిస్తారు. ఇన్ని విషయాలు నిజంగా జీవితంలో ప్రతికూల పరిస్థితలను ఎదుర్కుంటూ సాధించడం అనేది చాల గొప్ప విషయం. పైగా ఆయన కేవలం ఏదో ఆధ్యాత్మిక రంగంలో మాత్రమే సాధించారా అంటే ఆయనకి చరిత్ర తెలుసు, శాసనాలు తెలుసు. భూతద్దాలతో చదివేవారు. రాజులూ, వంశాలు, పరిపాలన, విదేశాలు, హిందూ ధర్మం, ఎక్కడెక్కడ ఎవరు ఏమి రాసారు, అందులో వున్న అంతర్గత విశేషాలు ఏమిటి, సంధ్య కాలం అని మాట్లాడితే ఇంకా దానికన్నా గొప్పగా చెప్పగలిగిన వారు వుండరు. ఆయన గొప్ప హాస్య చతురులు అని విన్నాం స్వామీ! ఆయన చక్కని హాస్యాన్ని ఇష్టపడేవారని తెలిసింది. ప్రత్యక్షంగా మీరు సేవించినవారు కాబట్టి అటువంటి సంఘటన ఏదైనా చెబితే మేమందరం కూడా ఎంతో సంతోషిస్తాం స్వామీ.**

**స్వామివారు :** వారి చిన్న వయస్సులో, పూర్వాశ్రమంలో నాటకంలో వారొక పాత్ర పోషించారు. షేక్స్పియర్ వ్రాసిన నాటకం 'టెంపెస్ట్'లో చేశారు. ఆ పాత్ర గురించి ఒక రోజు చెప్పారు. శబ్దంతో కూడిన వానలో సముద్రంలో పెద్ద వయస్సు గల వ్యక్తి మునిగిపోతూ పసిపిల్లవాని కల్మషంలేని చిరునవ్వుని చూసి (ఇన్నోసెంట్ స్మైల్) ధైర్యం లేదా శోక నివృత్తి కలిగిందట. అంటే నవ్వుకి, ఆ శక్తి ఉంది. ఒకసారి ఎంజీఆర్ గారు వచ్చారు. ఆయన విదేశంలో చికిత్స చేయించుకుని, మొదటి ప్రయాణంగా మద్రాసు ఎయిర్ పోర్ట్ నుండి స్వామివారిని సందర్శించుకోవాలని వచ్చారు. ఆ ఏర్పాట్లన్నీ మన జయేంద్ర సరస్వతి స్వామివారే చేశారు. విదేశం నుండీ ఎవరో వస్తున్నారు అని చెప్పారు, ఎంజీఆర్ వస్తున్నారంటే జనం బాగా వచ్చేస్తారు అని. తరువాత తెలిసింది అందరికీ ఎంజీఆర్ అని. 'స్వామివారు నన్ను ఆశీర్వదించారు' అన్న దృఢ విశ్వాసంతో ఆయన స్వయంగా స్వామివారిని సందర్శించాలని వచ్చారు. స్వామి వారి ఆశీర్వచనం వలన తనకు ఆరోగ్యం బాగుపడిందన్న నమ్మకం. పండ్లు తెచ్చి స్వామివారికి సమర్పించి కింద కూర్చున్నారు. ఎంజీఆర్ గారు అప్పుడు స్వామివారిని తమరి ఆరోగ్యం ఎలా వుందని అడిగారు. స్వామివారు నవ్వుతూ "నాకు కూడా అమెరికా డాక్టర్లే చూస్తున్నారు" అని చెప్పారు. అంటే మీరూ అమెరికా వెళ్ళారా అని ఆయన ఆశ్చర్యంగా అడిగారు. అంటే ఇదే అని కాదు. అనేక సందర్భాలలో వారు ఏ విషయమైనా సరే ఒక మర్యాద ఆ ప్రొసీజర్‌తో మాట్లాడుతారు.

"భారత్ కా కష్టమ్ – బ్రిటిష్ కా సిస్టమ్" అన్నట్లుగా 'ఆనో భద్రాః క్రతవోయంతు విశ్వతః' మనసులో భారతీయత వున్నా ఎక్కడెక్కడ మంచి అలవాట్లు వున్నాయో వాటిని అలా సూక్ష్మంగా చెప్తారు. ఆది, అంతం వుండదు. ఎందుకు చెప్తున్నారో మనం అర్థం చేసుకోవాలి. అది అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. ఆలోచన చేస్తేనే

అర్థం అవుతంది. అందుకని వారి 'పద విన్యాసం' కాని పద 'విన్యాసం' కానీ స్పష్టంగా ఉంటుంది. అడుగువేసే విధానం కానీ, పదములతో మాటలురాసే విధానం కానీ పద్ధతిగా వుంటుంది. ఆయన రసికులు. శుక్రవారం కానీ పౌర్ణమి కాని వున్నప్పుడు పల్లకిలో పడుకొని బాగా పాడేవారు. అంటే పౌర్ణమి రోజు వారు లలితాసహస్రం చంద్రుణ్ణి చూస్తూ చదువుతారు. అమ్మవారి పూజ మానసికంగా చేస్తారు. పీఠం బాధ్యతలని మన జయేంద్ర సరస్వతి స్వామి వారికి అప్పగించినపుడు కూడా, ఆ చంద్రమౌళీశ్వర ధ్యానంతో ఎక్కడ గ్రామానికి వెళ్ళినా కూడా ఒక గంట గంటన్నర మానసికంగా హారతి ఇస్తున్నట్టుగా భావిస్తూ ఖాళీ చేత్తో ధూపం ఇవ్వటం, ఇచ్చినట్టుగా చేతులు కదుపుతూ



పూజ చేసేవారు. ఆ చంద్రమౌళీశ్వరునితో ఆయనకి నిత్యానుబంధం. ఎవరైనా చిన్న సేవ చేసినా 50 సంవత్సరాలైనా ఆయనకు గుర్తుంటుంది. మీ తాతగారు ఇలా చేశారు, మీ తండ్రిగారు ఇలా చేశారు అని గుర్తు చెప్పి వారిని సంతోషింప చేస్తారు.

"స్త్రీ బాల వృద్ధ బుధ పామర నిర్విశేషం ఆనందయంతమఖిలం ప్రణమేమనిత్యం".

**చాగంటివారు :** స్వామీ చిట్ట చివరగా ఒక్క ప్రశ్న... మా అందరికీ చాతుర్మాస్య దీక్షా కాలంలో గొప్ప అనుభూతిని మిగిల్చేటటువంటి సభను మీరు ఇక్కడ చేస్తున్నారు అని మేం విన్నాం. సర్వ సాధారణంగా ఎంతటి విద్వాంసులైనా వారు ఏ రంగంలో వున్నారో ఆ రంగానికి సంబంధించిన విషయం మాట్లాడుతారు. ఒక శిల్పి శిల్ప శాస్త్రం గురించి, వైద్యుడు వైద్య శాస్త్రం గురించి మాట్లాడతాడు. కానీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారు చిన్న పిల్లలు పాటించవలిసిన నియమాల దగ్గర నుంచి ఒక గృహిణి ఎలా వుండాలి, ఒక ఉద్యోగి ఎలా వుండాలి, ఒక యువకుడు ఎలా వుండాలి, ప్రభుత్వాలు ఎలా వుండాలి, ప్రజా ప్రతినిధులు ఎలా వుండాలి సమాజ సేవ చేయడం ఎలా వుండాలి, ఇష్టాపూర్తములు అంటే ఏమిటి, మన చరిత్ర ఎటువంటిది, మన వేదం అంటే ఏమిటి, అద్వైతం అంటే ఏమిటి, ఇలా వారు అన్నింటినీ స్పృశించారు. వారి సందేశాలు భాషాజ్ఞానం వున్న వారికి మనసులోకి చొచ్చుకుపోతాయి. ఒక మనిషిని పూర్ణత్వంలోకి తీసుకెళ్ళేలా ఒక రాతిలోంచి శిల్పి విగ్రహం చేసి ప్రాణ ప్రతిష్ట చేసి అభిషేకం చేసి ఈప్సితాలు సిద్ధింప చేసినట్టుగా వుంటుంది. అంత గొప్ప ప్రవచనామృతంతో అనుగ్రహ భాషణాలతో ఏడు (7) వాల్యూమ్స్‌లో ఇంగ్లీషులో 'వాయిస్ ఆఫ్ గాడ్' అని వచ్చాయి. అవి ప్రత్యేకించి తెలుగు ప్రజలకు అందాలనే ప్రేమతో మీరు వాటిని తెలుగు భాషలో అనువదింప చేసి చాతుర్మాస్య దీక్షలో వుండగానే 'దేవుని స్వరం' అనే ఆ పుస్తక సంపుటిని ఇక్కడే ఆవిష్కరిస్తున్నారని మేం విన్నాం. నిజంగానే ఈ చాతుర్మాస్య కాలంలో గోశాలలో ఆ గ్రంథాలు ఆవిష్కరింపబడితే, ఆ సభలో మేం పాల్గొనటం మా జీవితాల్లో ఒక సువర్ణాధ్యాయం. అటువంటి పుస్తకాలు ఇక్కడి నుంచే తెలుగులో అందుబాటులోకి రావడం మాకు ఎంత అదృష్టమో. ఈ పుస్తక ఆవిష్కరణ, సభ గురించిన విషయాలు మీ నుండి వినాలని వుంది స్వామి.

**స్వామివారు :** 'దైవత్తిన్ కురళ్' అని తమిళంలో పుస్తకాలు వచ్చినాయి. 'వాయిస్ ఆఫ్ గాడ్' అని ఇంగ్లీషులో వచ్చినాయి. ఇంకా ఉత్తర దేశ భాషలలో, విదేశీ భాషలలో కూడా తర్జుమా చేయించినాము.



జర్మనీ, ఇండోనేషియన్, ఫ్రెంచ్ వీటిలో అయినాయి. చాల రోజులుగా తెలుగు భాషలో రావాలి అని భక్తుల కోరిక. మాకూ తేవాలని వుంది. కానీ ఇప్పుడే అది సాధ్యమైంది. అది కూడా కాకినాడలో. ఇప్పుడే ప్రకాశానికి వస్తోందనుకోండి. ఇదివరకు 'సాధనా గ్రంథమండలి' ద్వారా 'జగద్గురు బోధలు' అని కొన్ని భాగాలు వచ్చినాయి. కానీ ఇప్పుడు సమగ్రంగా ఈ 4, 5 వేల పేజీల పుస్తకాలు రావటం అనేది చాలా మంచి విషయం. హిందీ భాష తరువాత బహుళ వ్యాపకమైన భారతీయ భాష తెలుగు భాష. ఇక్కడ వుండే ఆస్తిక్యము, ఆచారము, ఆదరణ, స్వామి వారి పట్ల భక్తులకు వుండే ఆసక్తి, స్వామి వారికీ వుండే అనుగ్రహం చాలా విశేషంగా ఉంటాయి. (అప్పట్లోనే అంటే 26/1/1937లో స్వామి వారు కాకినాడకు రావడం సముద్ర స్నానం చేయటం జరిగింది.) అలా స్వామివారికి ఈ ఆంధ్ర దేశంపై, ఇక్కడి ప్రజలపై ప్రత్యేకమైన అనుగ్రహం అభిమానం ఉండడ మైనది. ఇంతవరకూ తెలుగులో ఈ పుస్తకం రాలేదే అంటే, దేనికైనా సమయం అనుకూలించాలి. స్వామివారు ఇక్కడ చాతుర్మాస్యం చేయాలి అని మీరు అనుకునే 3 సంవత్సరాలు అయిపోయింది, కానీ 'దేవుని స్వరం' రావటానికి చాలా సమయం పట్టింది. సమయానికి ఈ చోటుకి రావాలి అనేది స్వామి వారి అనుగ్రహ విశేషం. అందుకని 'దేవుని స్వరం' అనే ఈ ప్రత్యేక పుస్తక ఆవిష్కరణ ఈ చాతుర్మాస్యంలో రాబోయే నెలలో గోశాల ప్రాంగణంలో ఒక గొప్ప ఉత్సవంలాగా చేయాలని ఒక ఉద్దేశ్యం.

**చాగంటివారు : అది ఏ తారీఖున అయ్యే అవకాశం వుంది స్వామీ.**

**స్వామివారు :** అవకాశంబట్టి 'విశ్వరూప యాత్ర' (సీమోల్లంఘనం) అంటే ఈ చాతుర్మాస్యానికి మూడు రోజులు ముందు సెప్టెంబర్ 7వ తారీఖు అని అనుకుంటున్నాము. ఆ రోజు ద్వాదశి. ఆంధ్రదేశ జనులకు ఇది ఒక శుభ వార్త, ఒక అనుగ్రహ సందేశం, ప్రజలందరూ సంతోషించే అవకాశం వుంటుంది. ఆ ఉత్సవం ద్వారా స్వామివారి గురించి, స్వామివారి సందేశాలు గురించి మీరు గ్రామ, నగరాలలో చేస్తున్న ప్రచారానికి కూడా ఒక ఆకాంక్షను కలిగిస్తుంది. స్వామివారు ఒక సంచారి కనుక ఆయన ప్రవచనసారం తెలుసుకోవాలి. చాతక పక్షిలాగా ఎదురుచూసే వాళ్ళందరికీ ప్రశాంతత, ఉత్సాహజనకంగా ఈ పుస్తక ఆవిష్కరణ త్వరలో జరగబోతూంది. కాకినాడ సత్సంగ సభ్యులందరికీ కూడా చాతుర్మాస్యంలో ఒక గొప్ప



అవకాశం. ఆంధ్రదేశ భక్తులు 'దేవుని స్వరం' చదువుకొని తద్వారా స్వామివారి ఉద్దేశ్యాన్ని తెలుసుకుని వారి అనుగ్రహం పొందాలి. సత్సంగం ద్వారా. అందరూ ఈ సదవకాశాన్ని వాడుకోవాలి.

**చాగంటివారు:** ఆంధ్రదేశంలో కొన్ని కోట్లమంది కోరిక ఇది 'వాయిస్ అఫ్ గాడ్' అనేది తెలుగులో రావాలని. ఈ 7 వాల్యూమ్స్ కూడా తెలుగులో పుస్తకాలుగా గ్రంథావిష్కరణ జరగాలని కోరుకుంటున్నాము. ఎవరింట్లోనైనా, పెళ్లి జరిగినా, ఒక మేనమామ మేనకోడలికి, మేనల్లుడికి గాని ఇచ్చినా, అన్నదమ్ములు శ్రావణ పౌర్ణమినాడు అక్కచెల్లెళ్ళకు ఇచ్చినా, ఒక భర్త భార్యకు ఇచ్చినా, ఒక భార్య భర్తకు ఇచ్చినా, ఒక ఉపాధ్యాయుడు విద్యార్థికి ఇచ్చినా, ఎక్కడ ఏ ఉత్సవంలోనైనా సరే బహుశ ఈ పుస్తకాలే ఇక బహుమానంగా ఇవ్వడం జరుగుతుంది స్వామి.

**స్వామివారు:** పారితోషకం ఇది.

**చాగంటివారు :** ఆ పుస్తకాలు ఇంగ్లీషులో నేను చూశాను స్వామి. అసలు అవి మనిషిని చెక్కుతాయి. నా ఉద్దేశ్యంలో అయితే మహాస్వామివారు మన ఎదురుగుండా కూర్చుని మాట్లాడితే ఎలా వుంటుందో అట్లా వుంటాయి. ఎంత అద్భుతమైన పుస్తకాలో స్వామి. మీరు ప్రేమతో గోశాలలో ఈ అరుగుమీద కూర్చుని మా అందరితో మాట్లాడుతున్నప్పుడు మేము ఎటువంటి అనుభూతి చెందుతామో, ఆ పుస్తకం చదువుతున్నపుడు అంత గొప్ప అనుభూతి కలుగుతుంది. అంత గొప్ప గ్రంథావిష్కరణ సెప్టెంబర్ 7న సాయంకాలం 5 గంటలకి వుంటుందేమో.

**స్వామివారు:** అదే. సంధ్యారంభ విజృంభితం.

**చాగంటివారు:** ఈ గొప్ప అనుభూతిని మేము హిందూధర్మం ఛానల్ ద్వారా ....

**స్వామివారు:** అది ప్రత్యక్ష ప్రసారం.

**చాగంటివారు :** బహుశ దీనినే ఆహ్వానంగా చెప్పవచ్చు అనుకుంటా.

**స్వామివారు:** చెప్పవచ్చు.

**చాగంటివారు:** అందరూ కూడా పాల్గొనాలి. ప్రజలకి మన సంస్కృతి మీద వున్న ఆకాంక్ష గొప్పది. మంచి విషయం దొరికితే డబ్బు గురించి ఆలోచించరు, మొట్టమొదటి రోజు మీరు ఎన్ని ప్రతులైతే ఇక్కడ పెడతారో అన్నీ పది నిముషాలలో అయిపోయి అంతటితో ఆగక వాటిని చదివి, వాటిలో చెప్పినవి ఆచరించి మహాస్వామివారి అడుగుజాడల్లో నడుస్తాం.

**స్వామివారు:** అనుగ్రహ ప్రసాదంగా స్వీకరించాలి, జీవించాలి.

**చాగంటివారు :** మేము నిజంగా ఆశ్చర్యపోతున్నాము. 24 గంటలలో 20 గంటలు ఇలా అందరి మధ్యలో తిరుగుతూ కూడా కించిత్ కోపం లేకుండా, ఇంత గొప్పగా, ప్రశాంతంగా, అందరినీ అనుగ్రహిస్తూ వున్నారు. నాబోటి వాడు ప్రతిదానికీ ఉద్రేక పడిపోతుంటాడు. మాకు మళ్ళీ ఇంకో శంకరాచార్యుల వారి దర్శనం అయినట్టుగా అందరి మనసులు ఆనందంతో నిండిపోయి వున్నాయి. సుందరకాండలో హనుమ సీతమ్మకి ఇప్పుడు బెంగలేదు కానీ, 'మీరు సీతమ్మ కోసం శోకిస్తున్నారు అని సీతమ్మ శోకిస్తున్నారు' అని అంటారు. అలా మాకుకూడా బెంగ ఏమిటంటే 'ప్రత్యాయాంతి గతాః పునర్న దివసాః కాలో జగద్భక్షకః' అని సెప్టెంబర్ 10 వ తారీఖు వచ్చేస్తుందే, మీరు సీమోల్లంఘనం అనే పేరుతో గోశాలనుంచి బయలుదేరి వెళ్ళిపోతే, ఈ గోశాల అరుగులు, మీరు తిరిగిన ప్రదేశాలు, మీరు చంద్రమౌళీశ్వర ఆరాధన చేయడం - ఈ మధుర స్మృతులు పటిక బెల్లం తినేసిన నోరులా, యాలకుల పానకం తాగిన త్రేన్పులా తలుచుకుంటూ పరమానందంతో తరచూ కాంచీపురం వచ్చి మీ దర్శనం చేసుకుని మీ పాద ధూళి తల మీద ధరించి తరిస్తాం స్వామి. నిజంగా మా కోసం ఇంత శ్రమ తీసుకుని నేను తెలిసో తెలియకో అడిగినటువంటి ఈ ప్రశ్నలకు అన్నింటికీ మీరు ఇంత ప్రేమతో జవాబు ఇచ్చినందుకు అందరి పక్షాన శతకోటి నమస్కారాలు తెలుపుతున్నాను స్వామీ.

**స్వామివారు :** అంటే ఇక్కడికి రావడానికి కారణమే ప్రేమ.

'చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం'

హరహర శంకర జయజయ శంకర



శ్రీ ఎ. కుప్పుస్వామిగారు ఆంగ్లంలో రచించిన 'SHANKARACHARYA and His connection with kanchipuram' అనే ఎనిమిది అధ్యాయాల పుస్తకం నుండి తెలుగు అనువాదం రెండవ అధ్యాయం ఈ నెల సంపుటిలో...

# కాంచీపురంతో శ్రీశంకరాచార్యుల అనుబంధం

### 2. శంకర దిగ్విజయ యాత్ర - వారణాసిలో శంకరులు

పవిత్రమైన గంగా నదీ ఒడ్డున ప్రసిద్ధి చెందిన మోక్షపురిగా భావించే కాశీ విషయానికి వస్తే, శంకరులవారు తన కౌమార, యుక్తవయస్సులో సుదీర్ఘకాలం పవిత్ర నగరంలో నివసించినట్లు ఆయన జీవితగాథలు అన్నీ తెలియచేస్తున్నాయి. ఆయన ఈ కాలంలోనే వ్యాసుని, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, భగవద్గీత వంటి గ్రంథాలపై భాష్యాలను రచించారు. శంకరుల వారు వ్యాసులవారిని కలిసిన చారిత్రిక ఘట్టం, సనందనుడు ఆచార్యుని శిష్యుడు కావడం అన్నవి ఆయన వారణాసిలో నివసిస్తున్న కాలంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలు అని చెప్పుకోవచ్చు.

భారతదేశ ఆధ్యాత్మిక రాజధాని అయిన వారణాసి సందర్శన గురించి, ఆయన అక్కడ నివసించినప్పటి ఆసక్తికరమైన విషయం గురించి శంకరవిజయ రచనల నుంచి కొన్ని ప్రకరణలు.

1. మాధవ శంకర విజయం
2. చిద్విలాసుని జీవిత గాథ
3. ఆనందగిరి యొక్క శంకర విజయం

**మాధవ శంకరవిజయం :**

శ్లో॥ ప్రాప తాపసవరః స హి కాశీమ్ నీప కానన పరీత సమీపామ్, ।
ఆపగా నికట హాటక చంచద్ యూప పంక్తి సముదంచిత శోభామ్. ॥(V - 65)

(గొప్ప తపస్వి (శంకరుడు) సమీపంలో కదంబ వృక్షాలతో కూడిన అరణ్యాలు కలిగి, గంగానది ఒడ్డున ఉన్న ప్రకాశవంతమైన, యజ్ఞసంబంధమైన స్వర్ణ స్తంభాలతో అలంకృతమైన కాశీని చేరుకున్నారు.)

శ్లో॥ అమానుషం తస్య యతీశ్వరస్య విలోక్య బాలస్య సతః ప్రభావం, ।
అత్యంతం ఆశ్చర్యయుతాంతరంగాః కాశీ పురస్థా జగదుః తదేత్థం. ॥(VI - 81)

(బాలసన్యాసి (శంకరులు) మానవాతీత తేజస్సును, మేధస్సును చూసి మనసులో గొప్ప ఆశ్చర్యం నిండిన కాశీవాసులు ఆయనను ఈ విధంగా స్తుతించారు).

శ్లో॥ అస్యాత్మనిష్ఠాతిశయేన తుష్టః ప్రాదుర్భవన్ కామరిపుః పురస్తాత్, ।
ప్రచోదయామాస కిల ప్రణేతుం వేదాంత శారీరక సూత్ర భాష్యం. ॥(VI - 83)

(శంకరుని అద్భుతమైన స్వీయ నియంత్రణ, నైపుణ్యాన్ని చూసి హర్షించిన పరమశివుడు ఆయన ముందు ప్రత్యక్షమై బ్రహ్మసూత్రాలపై భాష్యం రాయమని ఒప్పించారు).

శ్లో॥ వ్యాఖ్యాహి భూయో నిగమాంత విద్యాం విభేద వాదాన్ విదుషో విజిత్య, ।
గ్రంథాన్ భువి ఖ్యాపయ సానుబంధాన్ అహం గమిష్యామి యథాభిలాషం. ॥(VII - 49)

(వేదాంత సూత్రాలపై శంకరుని భాష్యంపై వారిరువురికీమధ్య జరిగిన గంభీరమైన చర్చ ముగింపులో వ్యాస మహర్షి అన్న మాటలను పై పద్యం నమోదు చేస్తుంది. భాష్యం పట్ల గొప్ప సంతృప్తిని వ్యక్తం చేసి, ప్రశంసలు కురిపించిన వ్యాసమహర్షి, ఉపనిషత్తులపై కూడా భాష్యాలను రాయవలసిందిగా సూచించారు. అనంతరం రుషి తన కోరిక మేరకు వెళ్ళిపోతానని పేర్కొన్నారు).

**చిద్విలాసుని జీవిత చరిత్ర :**

ఈ రచన శంకరులవారు వారణాసిలో నివసించిన సమయం గురించి, ఆ కాలంలో జరిగిన ఘటనలను వివరించడానికి నాలుగు అధ్యాయాలను కేటాయించింది. ఈ గ్రంథంలోని 12వ అధ్యాయంలోని తొలి పద్యం తన శిష్యులతో కలిసి పవిత్ర నగరమైన కాశీకి శంకరుల రాకకు సంబంధించింది. ఆయన మణికర్ణిక ఘాట్‌లో నివసించడం, రోజూ గంగలో స్నానమాచరించి విశ్వనాథుని పూజించడం, ఈ గొప్ప బాల సన్యాసిని చూసి గొప్ప సంతోషంతో ఉప్పొంగిపోతున్న ప్రజల గురించి, కాశీ రాజు చూపిన వినమ్రత గురించి, శంకరుల పట్ల సనందనుడి (పద్మపాదుడు) భక్తి శ్రద్ధల గురించి తర్వాతి పద్యాలు వివరిస్తాయి. తర్వాతి అధ్యాయం (13)లో, తోటకుడు అనే శిష్యుడిని పరిచయం చేయడం జరిగింది. ఇక, 14 - 15వ అధ్యాయాలు ప్రసిద్ధి చెందిన భాష్యాల రచన, వ్యాసులవారు (ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపంలో) శంకరుని కలవడం గురించి, వ్యాస సూత్రాలపై సుదీర్ఘ చర్చ, చివరకు తన నిజరూపాన్ని వ్యాసులవారు వెల్లడించి, శంకరుని భాష్యంపై గొప్ప సంతృప్తిని వ్యక్తం చేసి, ప్రశంసించడం, ఆయనను ఆశీర్వదించడంతో పాటు, శంకరులు వ్యాసులవారి చుట్టూ తిరిగి ప్రదక్షిణ చేసి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేయడం వంటి విషయాలు ఉన్నాయి.

పైన సంక్షిప్తంగా ఇచ్చిన విషయాంశాలకు సంబంధించిన శ్లోకాలు ఈ విధంగా ఉన్నాయి:

శ్లో॥ తతః క్రమేణైవ స దేశికేంద్రో వారాణసీమీశనికేతభూతాం, ।
నానావిధాశ్చర్య నివేశ కోశాం వివేశ తూర్ణం సహ శిష్యవర్గైః. ॥
శ్రీమానసౌ శంకరదేశికేంద్రః సాధూదితే భాస్కరసారథౌ చ,
స్నాత్వైవ తోయే మణికర్ణికాయాః విశ్వేశ్వరం ప్రత్యహమర్చతి స్మ.
వాసం చకారానిశమేష శిష్యైః సాకం స ఘట్టే మణికర్ణికాయాః, ।
దిదృక్షవః తత్ర యతీంద్ర మేనం ........ (XII - 1,2,3)

వ్యాసః సమాలోక్య సమస్తమేనత్ విస్మేరచిత్తో ధురి సన్న్యధత్త, ।
ఆస్థాయ రూపం నిజమేవ దివ్యం తుష్టావ భూయో వర దేశికేంద్రం. ॥
వ్యాసం విదిత్వాఽథ స దేశికేంద్రః ప్రదక్షిణీకృత్య నమశ్చకార, ।
యాతోఽహమద్యైవ కృతార్థభావం భవత్ పదాంభోజ విలోకనేన. ॥ (XIII - 40,41)
తతః పద్మోద్భవవ్యాసౌ త్వద్భాష్యం జగతీతలే, ।
ఆసేతుహిమవచ్ఛైలం ప్రసిద్ధం భవతాదితి. ॥ (XIV - 35)

## ఆనందగిరి శంకర విజయం :

ఆనందగిరి శంకర విజయంలో 'వ్యాస దర్శనం' అనే శీర్షికతో 52వ ప్రకరణం దిగువన పేర్కొన్న భాగంతో ప్రారంభమవుతుంది:
ఏవం అశేష మత నిబర్హణం కృత్వా దినమణౌ దినమధ్యం గతే మణికర్ణికాతీరే నిదిధ్యాసనలాలసే
పరమగురౌ భగవాన్ వ్యాసః కిల స్థవిరబ్రాహ్మణ ఇవ సమాగత్య షట్ సహస్ర శిష్య సమేతం
ప్రమథావృతమీశ్వరమివ దేవావృతమింద్రమివ ఋష్యావృతం బ్రాహ్మణమివ దృష్ట్వా కోఽయమిత్యాక్షిపత్. ।

ఒకరోజు వారణాసిలోని మణికర్ణికా ఘాట్‌లో మధ్యాహ్నవేళలో గాఢమైన ధ్యానంలో ఉన్న మహాగురువు (ఆదిశంకరులు) కూర్చొని ఉన్నారు. ఒక వృద్ధుని వేషంలో వ్యాసులవారు అక్కడకు వచ్చారు. అక్కడ, యువ శంకరులవారి చుట్టూ ఆరువేలమంది శిష్యులు కూర్చుని ఉన్న దృశ్యం ప్రమథగణాల మధ్య కూర్చున్న శివుడిని, దేవతల మధ్య ఉన్న ఇంద్రుడిని, ఋషుల మధ్య కూర్చున్న బ్రహ్మను తలపించింది. ఆ యువకుడు ఎవరని శిష్యులను వ్యాసులవారు ప్రశ్నించారు. మారువేషంలో ఉన్న ఆ వ్యక్తికి వారు ఈ విధంగా జవాబు ఇచ్చారు:


శ్లో॥ శృణు వృద్ధ పరానంద గురుశ్శంకర నామకః, ।
సేతు ప్రభృతి దేశేషు మతధ్వంసనమాచరన్. ॥
భాష్యం కృత్వా బ్రహ్మసూత్ర తాత్పర్యార్థ వినిర్ణయం,
అద్వైతార్థావబోధేన శిష్యాన్ కృత్వా వివేకినః, ।
జయత్యేవ హి గంగాయాః తీరావిర్భూతరుద్రవత్. ॥

"ఓ పెద్ద మనిషీ! ఈయన సచ్చిదానందంలో మునిగిన ఆచార్యుడైన శంకరుడు. రామేశ్వరం వంటి క్షేత్రాలలో నాస్తికులను, సంప్రదాయ వ్యతిరేకులను రూపుమాపి, బ్రహ్మసూత్రాలకు నిర్ణాయత్మకమైన, స్పష్టమైన అర్థాలతో భాష్యాన్ని రాయడమే కాకుండా అద్వైత సిద్ధాంతాన్ని గ్రహించేందుకు, తెలివైన శిష్యులకు శిక్షణ ఇచ్చి, గంగ ఒడ్డున రుద్రునిలా ప్రకాశిస్తున్నాడు.

అప్పుడు ఆ వృద్ధునికి, శంకరులకు మధ్య కొన్ని బ్రహ్మసూత్రాల అర్థంపై సుదీర్ఘమైన చర్చ ప్రారంభమైంది. ఆ వృద్ధుడు మారువేషంలో ఉన్న వ్యాసులవారని తన శిష్యుడైన పద్మపాదుని ద్వారా తెలుసుకున్న శంకరులు వ్యాసులవారికి ప్రణామాలు అర్పించాడు. సూత్రాల వివరణ, వ్యాఖ్యానంతో సంతృప్తి చెందిన వ్యాసులు శంకరులను ఆశీర్వదించి, ఆయన జీవితకాలాన్ని పొడిగించే వరాన్ని ఇచ్చేందుకు వచ్చిన బ్రహ్మతో కలిసి బయలుదేరారు.

ఈ వివరాలు ఆనందగిరి రచనలోని 52వ ప్రకరణలో ప్రధాన భాగంగా, తర్వాత రెండు ప్రకరణాలలోనూ వివరించారు.

# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి జయంతి



బ్రహ్మశ్రీ కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీమతి అంబాలక్ష్మి దంపతులకు 1969 మార్చి 13న ఉత్తరాషాఢ నక్షత్రంలో 8వ సంతానముగా జన్మించిన పుత్రుననికి శంకర నారాయణ అని నామకరణం చేశారు. తమిళనాడులోని తండలం అనే గ్రామంలో జన్మించిన ఆయన మహాపండితులైన వారి తండ్రి శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారి వద్దే వేదాన్ని 'నియమాధ్యయన' పద్ధతిలో అధ్యయనం చేశారు. వేదంతో పాటు సంస్కృతం పఠనం కాకావాకలోని శ్రీ మహాదేవశాస్త్రిగారి వద్ద కొనసాగించారు. తండ్రిగారి పర్యవేక్షణలో తదేక దీక్షతో ఋగ్వేద సంహిత, పదము, క్రమము, లక్షణాంతం చదువుకున్నారు.

శ్రీజయేంద్రస్వామివారు శ్రీమఠం పరివారంతో సహా కాకవాక గ్రామంలో బస చేసినప్పుడు 8ఏళ్ళ వయస్సు కలిగిన శ్రీశంకరన్ స్వామివారిని దర్శించుకుని ఆయన ఆశీర్వచనం పొందారు. తర్వాత పదకొండేళ్ళ వయసులో సతారాలో శ్రీ చంద్రశేఖర సరస్వతిస్వామివారి దర్శన భాగ్యం ఆయనకు కలిగింది. మరు ఏడాది, అంటే 12 ఏళ్ళ వయస్సులో మహారాష్ట్రలోని బ్రహ్మపూర్‌లో మహాస్వామి దర్శనం చేసుకున్నారు. దర్శనం చేసుకోవడానికి తహతహలాడాల్సిన అవసరం లేకుండానే, మహాస్వామివారే ఆ బాలుడిని తన వద్దకు పిలిపించుకున్నారు.

కంచికామకోటి పీఠాధిపతులైన మహా స్వామివారు పూజ్యులు జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు 1983 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. ఆ సమయంలో శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు తన వారసుడిగా శంకరన్ పేరును ప్రకటించారు, తదనంతరం మహబూబ్‌నగర్‌కు వెళ్ళి, అక్కడ మహాస్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు శ్రీ శంకరన్‌కు మే20, 1983న సన్యాస దీక్షను ప్రసాదించి, శ్రీశంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారిగా, కంచికామ కోటిపీఠం 70వ ఆచార్యులుగా ప్రపంచానికి ప్రకటించారు.

సన్యాస స్వీకరణ సమయంలో శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామివారి వయసు 13 సంవత్సరాలు మాత్రమే కానీ వారి మేధాసంపత్తి అనంతం. నడిచే దేవుడైన మహాస్వామి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి శిష్యరికంలో వేదవేదాంగాలనూ అభ్యసించారు. 1983 జులై మాసంలో జగద్గురువులు ముగ్గురూ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు పట్టణంలో చాతుర్మాస్య వ్రత దీక్షను పాటించారు.

శ్రీ జయేంద్రస్వామివారి ఆశీస్సులతో, మహాస్వామివారి సుశిక్షణలో ప్రస్థానత్రయం అనగా, బ్రహ్మసూత్రం, శంకర భాష్యం, ఉపనిషత్తులు, భగవద్గీత వీటి శంకరభాష్యంతో పాటు అభ్యసించారు. సన్యాసాశ్రమ విధిలో పాటించాల్సిన నియమాలను, వాటి క్రమశిక్షణను బాలస్వామి

క్షుణ్ణంగా అవగతం చేసుకున్నారు. స్వాములు యాత్రలకు బయలుదేరినప్పుడు బాలస్వామివారిని వెంట తీసుకునే వెళ్ళేవారు.


బాలస్వామివారు 1988 నుండి తమ గురువు వెంట తమిళనాడు నుంచి నేపాల్ సహా భారతదేశమంతా పర్యటించారు. అప్పటి నుంచి తన యాత్రలను కొనసాగిస్తూనే ఉన్నారు.గత సంవత్సర కాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో స్వామివారి దిగ్విజయ యాత్ర కొనసాగుతోంది.

సనాతన ధర్మ సంరక్షణ కోసం శతాబ్దాల కింద స్థాపించిన శ్రీకంచి కామకోటి పీఠం ప్రజాహితం కోసం, విద్యా, వైద్య, వేద రంగాలలో ఎన్నో వ్యవస్థలను ఏర్పాటు చేసింది. శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు అన్ని సామాజిక వర్గాలకు అందుబాటులో ఉంటూ, అందరికీ తమ ఆప్యాయతను, ఆశీర్వాదాలను ఎల్లప్పుడూ అందిస్తూ ఉన్నారు. వారు తమ సమయాన్ని, ఆలోచనలను పూర్తిగా భారత సంప్రదాయాన్ని, సంస్కృతిని, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడానికే వినియోగిస్తూ అందరికీ తమ దివ్య అనుగ్రహాన్ని అందిస్తున్నారు.

## ఫిబ్రవరి 18న విశాఖపట్టణంలో ఘనంగా స్వామివారి 55వ జయంతి మహోత్సవం

పూజ్యశ్రీ స్వామివారి జయంతి మహోత్సవం విశాఖపట్నంలోని శ్రీమఠం శిబిరంలో, కాంచీపురంలో మరియు అనేక ఇతర ప్రదేశాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. తెల్లవారుఝామునే మంగళవాయిద్యాలతో అనేకమంది భక్తులు విశ్వరూప దర్శనం చేసుకున్నారు.





వేదమంత్రోచ్చారణలతో హోమ కలశాల్లోని పవిత్ర జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. శ్రీ కంచి కామాక్షి అమ్మవారు దేవస్థానం మరియు తంజావూరులోని శ్రీ బంగారు కామాక్షి దేవాలయం సహా వివిధ దేవాలయాల నుండి స్వామివారికి ప్రసాదాలు అందించబడ్డాయి. స్వామివారు మహారుద్రం మరియు శత చండీ యాగములు జరుగుతున్న యాగశాలను సందర్శించి పూర్ణాహుతి, హోమాలు నిర్వహించారు. భక్తులకు 'పూజ' తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వదించారు.



జయంతి సందర్భంగా కన్యాపూజ, వటుపూజ, దంపతీ పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారు పూజ్యశ్రీ జయేంద్రసరస్వతి స్వామివారికి స్వర్ణ పాదపూజ, మహాశివరాత్రి పూజలు నిర్వహించారు. అనేక మంది కళాకారులతో అయిదు రోజులపాటు వాద్య, గాత్ర సంగీత కార్యక్రమాలు, హరికథ, భజనలు, నామ సంకీర్తనం, ప్రవచనాలతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాంప్రదాయ, వాతావరణంతో భక్తులు పులకించి పునీతులయ్యారు.



# శ్రీ కంచి కామకోటిపీఠ ఆచార్యులు జగద్గురు శ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి 5వ ఆరాధనా మహోత్సవం

శ్రీమత్ ఆదిశంకర భగవత్పాదాచార్యులచే స్థాపించబడ్డ శ్రీకంచి కామకోటి పీఠంలో అరవై ఏళ్ళకు పైగా **69**వ శంకరాచార్యులుగా పూజ్య శ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు పీఠాన్ని అలంకరించారు. వారు తమ అపరిమితమైన ఆశీస్సులను, ఆధ్యాత్మిక మార్గదర్శనాన్ని మనందరికీ అందించారు. దేశవ్యాప్తంగా అనేక పర్యాయాలు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, అంబాజీ నుంచి కామాఖ్యతో పాటుగా ఖాట్మండు, ఢాకా, కైలాశ్ వరకు పర్యటనలు చేసిన శ్రీ స్వామివారు యావత్ సమాజ, దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సంక్షేమం కోసం కృషి చేశారు.

స్వామివారు వైదిక అధ్యయనం, సమకాలీన విద్య, ఆరోగ్య పరిరక్షణ, అన్నదానం, వృద్ధులకు తోడ్పాటు, ప్రతి ఒక్కరి సంక్షేమం సహా అనేక రంగాలలో జరుగుతున్న కార్యకలాపాలను, పలు సంస్థలను స్థాపించారు, ఆశీర్వదించారు.








గోష్పద క్షేత్రమైన కొవ్వూరులో పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి ఆరాధన మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు గోదావరి నది స్నానం ఆచరించి ఆరాధన ఊరేగింపును పూజలను నిర్వహించారు.

# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి విజయయాత్రా విశేషాలు





**4-02-23 -** (శనివారం) పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు విశాఖపట్టణం MVPకాలనీలో ఉన్న శ్రీ పార్వతీ సమేత ముక్తేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి హారతి ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు అక్కడికి వచ్చిన భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేస్తూ 'పద్ధతి' కోర్సు తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు.





**05-02-23 -** (ఆదివారం ఉదయం, పౌర్ణమి) తైయ్ పూసం సందర్భంగా, పూజ్యశ్రీ స్వామివారు సుబ్రహ్మణ్య పూజ మరియు సుబ్రహ్మణ్య భుజంగ ప్రయాత స్తోత్ర పారాయణ మరియు కుమార భోజనానికి తరలివచ్చిన బ్రహ్మచారులను తీర్థప్రసాదాలతో ఆశీర్వదించారు. ముందుగా బ్రహ్మచారులు సంధ్యావందనం చేసుకుని అనంతరం సూర్య నమస్కారాలు చేశారు. ఆ రోజు కంచి పీఠంలో పౌర్ణమి విశేష పూజలు జరిగాయి.






8-02-23 - (బుధవారం) పూజ్యశ్రీ స్వామివారు సింహాచలంలోని శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు ఘనంగా ఆహ్వానం పలికారు. తరువాత దేవస్థానం వేదపాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.



ఫిబ్రవరి12,2023 150మందికి పైగా బాలికల బృందం నిర్వహించిన సమిష్ఠి తులసి పూజను స్వామివారు తిలకించి, ఆశీర్వదించారు.



శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు శంకరమఠంలో ప్రవచన కార్యక్రమంలో పాల్గొని అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్న సందర్భం.





ఫిబ్రవరి 20,2023 ఈరోజు శ్రీ చంద్రశేఖరేంద్ర మహాస్వామివారి గురువులు, 67వ పీఠాధిపతి జగద్గురు శ్రీ మహాదేవేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామివారి ఆరాధన శ్రీమఠం శిబిరంలో స్వామివారు నిర్వహించారు. వీరు బ్రహ్మశ్రీ నరసింహశాస్త్రి శ్రీమతి లక్ష్మి దంపతులకు 1889లో జన్మించారు. శ్రీ మహాదేవేంద్ర సరస్వతి అనే బిరుదుతో సన్యాస స్వీకరణం చేశారు. అతితక్కువ కాలం వారు పీఠాధిపత్యం వహించినా త్యాగం, గురుభక్తి, కర్తవ్యనిర్వహణకు వారు నిదర్శనంగా నిలిచారు. ఆ పరమగురువుల ఆరాధన సందర్భంగా శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు వారిని స్మరించుకున్నారు.





21-02-23 (మంగళవారం) - పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు విశాఖపట్నం బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయాన్ని సందర్శించి భక్తులను ఆశీర్వదించారు.





**21-02-23** (మంగళవారం)శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారికి విశాఖపట్టణంలో గౌరవ వీడ్కోలు సందర్భంగా ముందుగా శోభాయాత్ర తరవాత AU కన్వెన్షన్ సెంటర్‌లో పౌర అభివందన సభ జరిగింది.









**24-02-23** (శుక్రవారం) – పూజ్యశ్రీ స్వామివారు మఠం శిబిరానికి ఆనుకుని ఉన్న నాగవల్లి నదిని దర్శించుకున్నారు. అరసవల్లి ఆలయ పండితులచే కంచిపీఠంలో వేదపారాయణం చేయించి, కోలాటం, దీపపూజ నిర్వహించారు.

**25-02-23** (శనివారం, సాయంత్రం) – పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు శ్రీకాకుళం సమీపంలోని శ్రీ కూర్మం ఆలయాన్ని సందర్శించారు, అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం మరియు ఆశీర్వాదం అందించారు.



స్వామివారు శ్రీకాకుళంలోని శ్రీదేవి ఆశ్రమాన్ని సందర్శించినప్పటి సందర్భం



స్వామివారి సమక్షంలో ఆర్ఎస్ఎస్, శ్రీకాకుళం శాఖవారి సమావేశం







26-02-23 (భాను సప్తమి, ఉదయం) – పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు శ్రీకాకాకుళం సమీపంలోని శ్రీ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి భక్తులకు అనుగ్రహ భాషణం మరియు ఆశీస్సులు అందించారు.



26-02-23 (ఆదివారం, ఉదయం) – పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు ఎంతో ప్రోద్బలాన్ని, ఆశీర్వాదాన్ని అందించిన శ్రీకాకుళంలోని గ్రేటర్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ (GEMS)ని శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు సందర్శించారు. జయేంద్రులవారి పేరున ఉన్న ఆడిటోరియంలో స్వామివారు అనుగ్రహభాషణం చేసి వైద్యులను ఆశీర్వదించారు.



శ్రీకాకుళం ఎమ్మెల్యే అచ్చన్ననాయుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ నాయుడు, శ్రీకాకాకుళం ఎంపి కోన రవి కుమార్ పూజ్యశ్రీ స్వామివారిని దర్శించి ఆశీస్సులు తీసుకున్న సందర్భం.



**5-03-23** స్వామివారు శిల్ప కళా నిపుణులను (స్థపతులను) సత్కరించి, సనాతన ధర్మ దేవాలయాలకు వారు అందించిన విశిష్ట సేవలకు తగు బిరుదులను ప్రసాదించారు. ఈ సందర్భంగా స్వామివారు దేవాలయ శిల్ప కళను పోషించి కాపాడాలని విశేషంగా ప్రస్తావించారు. శ్రీ గణపతి స్థపతి కుమారులు జయేంద్ర స్థపతికి 'శిల్పకళానిధి' అని, శంకర స్థపతికి 'శిల్పరత్నప్రకాశ' అని, శ్రీ ముత్తయ్య స్థపతి గారి ఇద్దరు కుమారులు ముత్తయ్య శ్రీనివాస స్థపతి, ముత్తుకుమార స్థపతి కి 'శిల్పకళానిధి' అని మరియు శ్రీ సుబ్బయ్య స్థపతి కుమారులు శివ స్థపతికి 'శిల్పకళానిధి' అనే బిరుదులను ప్రసాదించి అనుగ్రహించారు.





**13-03-23**-శ్రీ స్వామివారు అన్నవరంలో శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ద్రవిడ సంప్రదాయ అనుసారం నిర్మించబడ్డ ఈ దేవాలయంలో శ్రీ అనంత లక్ష్మీ అమ్మవారి సమేతంగా శ్రీ సత్యదేవ స్వామివారు వెలిసి ఉన్నారు.



**7-03-23:** కొవ్వూరులో శ్రీ స్వామివారు 'సంస్కృత ప్రభామాలా', 'శివకర్ణామృతం', 'రామాయణసుధా హనుమద్దర్శనం' అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంలో స్వామివారు శ్రీ ఆది శంకరులు రచించిన మనీషా పంచకం అనే వేదాంత స్తోత్ర నాటక ప్రదర్శనను వీక్షించారు





**14-03-23** - శ్రీ స్వామివారు అన్నవరం దేవస్థానం వారు నిర్వహించే కృష్ణ యజుర్వేద, స్మార్త పాఠశాలకు విచ్చేసి అధ్యాపకులను, విద్యార్థులను ఆశీర్వదించారు. సోలార్ విద్యుత్ సౌకర్యాలతో కూడిన చక్కటి ప్రకృతి రమణీయమైన ఈ భవనంలో **30** మంది విద్యార్థులు, **3** అధ్యాపకులు వద్ద వేదాధ్యయనం చేస్తున్నారు. పూర్వం **25** నవంబర్, **2016** న శ్రీ స్వామివారు తమ విజయ యాత్ర భాగంగా ఈ పాఠశాల భవన నిర్మాణాన్ని ఆశీర్వదించి ప్రారంభించడం విశేషం.



# మూకపంచశతి
# ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

**కాంచీరత్నవిభూషాం కామపి కందర్పసూతికాపాంగీమ్ ।**
**పరమాం కలాముపాసే పరశివవామాంకపీఠికాసీనామ్ ॥11॥**

తాత్పర్యం: కాంచీపురమునకు రత్నమువలె ప్రకాశించుచున్న, మన్మమథునికి తన కటాక్షము చేత జన్మనిచ్చినటువంటి ,పరమశివుని ఎడమతొడయే తన పీఠముగా గల ఆ శ్రేష్ఠమైన కళను ఉపాసించెదను.

బాలమనోజ్ఞా:- కాంచీ అనగా వడ్డాణము అని. ఆ వడాణమునకు మధ్యన ప్రకాశించే రత్నము లేకపోతే ఆ మేఖలకే అందము రాదు. అదేవిధంగా ఈ తల్లి కాంచీనగరానికి మధ్యనున్న మణిపూసలాంటిది. అంటే బ్రహ్మాండమలన్నింటికీ ఈ కామాక్షి నాభిస్థానము. అందుకే 'కాంచీరత్నవిభూషా' తన తపోభంగమునకు కారణమైన మన్మథుని శివుడు దహించివేశాడు. కానీ కామకళను తన కన్నుల యందు జన్మింపజేసిన ఆ తల్లి కడగంటి చూపులకు ఆ దేవదేవుడు వశుడై కామేశ్వరుడైనాడు. అందుకే "కందర్పసూతికాపాంగీ" అన్నారు కవి. పరమ అనగా శ్రేష్ఠమైన లేదా చివరిదైన అని చెప్పుకోవచ్చు. చంద్రుని కళలు పదిహేను ఐతే ఈ తల్లి పదహారవ కళను ధరించినదట. ఈవిడే షోడశీ అని. ఇంకా అంతకు మించి ఉపాసించటానికి శ్రేష్ఠమైనది ఏదీ లేదు. అటువంటి షోడశిని నేను ఉపాసిస్తాను అని ఆచార్యులవారు వివరిస్తున్నారు.

**కంపాతీరచరణానాం కరుణాకోరకితదృష్టిపాతానామ్ ।**
**కేళీవనం మనో మే కేషాంచిద్భవతు చిద్విలాసానామ్ ॥12॥**

తాత్పర్యం:- కంపానదీ తీరమున విహరించు, కరుణ అనే మొగ్గలు తొడగిన చూపులు కలిగిన, మాటలకందని ఆ చిద్విలాసములకు నా మనస్సు హాయిగా విహరించు ఉద్యానవనము అగుగాక.

బాలమనోజ్ఞా:- ఆ తల్లి చూపులు కంపాతీరమున విహరిస్తూ ఉంటాయట. దేనికి? అక్కడ తనను సేవించుకునే భక్తులను అనుగ్రహించటానికి. ఆ చూపులు మామూలు చూపులు కావు. కరుణతో నిండినవి. అలా అని పూవులు వలె వాడిపోవటానికి సిద్ధమైనవి కావు. ఎప్పుడూ వికసించటానికి సిద్ధంగా ఉండే మొగ్గల వంటి చూపులట. ఆ కరుణ ఎప్పుడూ మొగ్గతొడిగే ఉంటుంది తప్ప ఎన్నటికీ వాడిపోదని అర్థం. అటువంటి కరుణతో నిండిన చూపులకు నా మనస్సు కేళీవనమగు గాక ! అది కూడా నా తండ్రియైన పరమేశ్వరునితో నా మనస్సనే ఉద్యానవనం విహరించవలసినది. అందువలన ఆ కరుణ ఇంకెప్పటికీ వాడదు. నాయందు కరుణాకటాక్షములు ప్రసరిస్తూనే ఉంటాయని అని స్వామివారు చెప్తున్నారు. 'విహారే సహ కాంతేన క్రీడితం కేళిరుచ్యతే' అని సాహిత్యదర్పణం.

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

# SRI KANCHI KAMAKOTI PEETAM

Jagadguru Shankaracharya Swamigal
Shrimatam Samsthanam, Kanchipuram





## Vijaya Yatra
of
Jagadguru Pujyashri Shankara Vijayendra Saraswathi Shankaracharya Swamigal
in
ANDHRA PRADESH

## Updates upto 31st March 2023

| DATE | PLACE | PLACE OF PUJA |
|---|---|---|
| Upto 9th Mar. | Kovvuru | Samskruta Patasala, Andhra Geervana Vidyapeetam |
| 10th to 12th Mar. | Hukkumpet | Residence of Sri Hota Sriramachandramurthy |
| 13th to 18th Mar. | Annavaram | Pampa Sathram |
| 19th to 20th Mar. | Devarapalli | Sri Venkateswara Swami Temple, Devarapallai, West Godavari Dist. |
| 21st to 31st Mar. | Pedaravuru | Sri Subrahmanya Swami Devalayam Pedaravuru, Guntur Dist. |

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM

JAGADGURU SHANKARACHARYA SWAMIGAL

SHRIMATAM SAMSTHANAM

1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

Koo

koo @kamakoti

www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



**గతిం భారతదేశస్య మతిం భారతజీవినామ్ ।**
**వందే యతిం సాధకానాం పతిమద్వైతదర్శినామ్ ॥**

భారతదేశ ప్రజల సౌభాగ్యానికి, సుఖ-శాంతులకు,
మనోబలానికి గొప్ప ఆధారంగా, అద్వైత తత్త్వసిద్ధి కొరకు
తపించే సాధకులకు మార్గదర్శిగా
విరాజించే శ్రీ జయేంద్ర యతీంద్రులకు అభివందనము.